RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in


మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 8 ఆదివారం 2 ఫిబ్రవరి 2025 పేజీలు : 4

### ఢిల్లీలో పెరుగుతున్న వాయు కాలుష్యం..

ఢిల్లీ వాసులకు కష్టకాలం మొదలైంది. ప్రతి ఏడాది చలికాలంలో ఢిల్లీ వాసులు తీవ్ర వాయు కాలుష్యంతో ఇబ్బందులు పడుతుంటారు. అయితే ఈ ఏడాది మరింత ముందుగానే ఢిల్లీలో వాయు కాలుష్యం పెరిగిపోయింది. ప్రమాద ఘంటికలు మోగిస్తోంది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ తక్కువగా ఉన్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది. తాజాగా ఢిల్లీలోని ఆనంద్ విహార్‌లో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 334గా నమోదైనట్లు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది చలి తీవ్రత పెరగడం, వాయు వేగం తగ్గడంతో ఢిల్లీ, చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలి నాణ్యత ప్రమాదకర స్థాయికి తగ్గిపోతోంది. పంజాబ్, హర్యానాలో పంట వ్యర్థాల దహనం వల్ల రాజధాని నగరం ఢిల్లీని పొగ అలిమేస్తోంది. దీంతో రాజధాని ప్రాంత ప్రజలు తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నారు.

# వేతన జీవులకు గుడ్ న్యూస్

## రూ. 12 లక్షల వరకూ నో ఇన్‌కం టాక్స్




ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్‌ను సమర్పించారు. ఆమె ఫిబ్రవరి 1, 2025, శనివారం ఉదయం 11 గంటలకు పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. ఇది మోడీ 3.0 పాలనలో మొదటి పూర్తి స్థాయి బడ్జెట్ అవుతుంది. బడ్జెట్ రోజుకు కొన్ని రోజుల ముందు, ప్రభుత్వం ఆదాయపు పన్ను చట్టం తెస్తుందని ప్రకటించారు. కొత్త ఆదాయపు పన్ను బిల్లును వచ్చే వారంలో పార్లమెంటుకు సమర్పించనున్నట్లు ఆమె ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ లో కొత్త పన్ను విధానం ప్రకారం, వార్షిక ఆదాయం రూ. 12 లక్షల వరకు ఉన్నవారు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. దీని కారణంగా, సాలీనా రూ.25 లక్షల ఆదాయం ఉన్నవారికి రూ.1 లక్ష ప్రయోజనం చేకూరుతుంది. దీంతో పాటు, టీడీఎస్, టీసీఎస్ లను రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే TDS ప్రక్రియ సరళం చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. అలాగే టీడీఎస్ నేర రహితం చేయబడుతుంది. టీడీఎస్ పరిమితి రూ.2.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుంది.

**ఇన్ కం టాక్స్ శ్లాబులపై కీలక పాయింట్లు ఇవే:** రూ. 12 లక్షల సాలీనా ఆదాయం వరకూ ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు..స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపితే రూ.12.75 లక్షల వరకు సున్నా పన్ను.

**కొత్త టాక్స్ శ్లాబులు ఇవే:** రూ. 0-4 లక్షల నిల్, రూ. 4 లక్షలు-రూ. 8 లక్షలు: 5%, రూ. 8 లక్షలు-రూ. 12 లక్షలు: 10%, రూ. 12 లక్షలు-16 లక్షలు: 15%, రూ. 16 లక్షలు-20 లక్షలు: 20%, రూ. 20 లక్షలు-24 లక్షలు: 25%, రూ. 24 లక్షల పైన: 30%.

**పాత పన్ను శ్లాబులో మార్పు లేదు:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాత పన్ను శ్లాబ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పాత పన్ను శ్లాబ్‌లో గతంలో లాగా రూ.5 లక్షల వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 50 వేల స్టాండర్డ్ డిడక్షన్ కూడా ఉంది.

**పాత పన్ను విధానం పన్ను స్లాబ్ :** - రూ. 0 నుండి రూ. 2.5 లక్షల వరకు: 0%, - రూ. 2.5 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు: 5%, - రూ. 05 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు: 20%, - రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం: 30%. రూ. 12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదని బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే స్టాండర్డ్ డిడక్షన్ రూ.75000గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రూ. 12,75,000పై ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే వార్షిక ఆదాయం రూ.12 లక్షల 75 వేలు ఉన్న వారు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.

**కేంద్ర వార్షిక బడ్జెట్ ఎంత.. ఏయే శాఖలకు ఎంత కేటాయించారు :** కేంద్ర వార్షిక బడ్జెట్2025-26ను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారమన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. మొత్తం రూ. 50,65,345 కోట్లతో 2025-26 ఏడాది కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ప్రధానంగా మధ్యతరగతి ప్రజానీకానికి భారీ ఊరట

### కొత్త ఆదాయపన్ను టాక్స్ శ్లాబులు ఇవే..

లభించింది. రూ.12 లక్షలలోపు ఆదాయం ఉన్నవారికి పూర్తిగా పన్ను మినహాయింపు ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. అలాగే రక్షణ శాఖకు అధికంగా నిధులు కేటాయించింది కేంద్రం. ఏఏ రంగాలకు ఎంత మేరకు బడ్జెట్‌లో నిధులు కేటాయించారో ఇప్పుడు చూద్దాం.

**వివిధ శాఖలకు కేటాయింపులు ఇవే..** రక్షణ రూ. 4,91,732 కోట్లు, గ్రామీణాభివృద్ధి రూ. 2,66,817 కోట్లు, హోం రూ. 2,33,211 కోట్లు, వ్యవసాయ, అనుబంధ రంగానికి రూ. 1,71,437 కోట్లు, విద్య రూ. 1,28,650 కోట్లు, ఆరోగ్య రూ. 98,311 కోట్లు, పట్టణాభివృద్ధి రూ. 96,777 కోట్లు, ఐటి, టెలికం రూ. 95,298 కోట్లు, విద్యుత్ రూ. 81,174 కోట్లు, వాణిజ్య, పరిశ్రమలు రూ. 65,553 కోట్లు, సామాజిక సంక్షేమం రూ. 60,052కోట్లు, వైజ్ఞానికి విభాగాలకు రూ. 55,679 కోట్లు/

**కేంద్రానికి వచ్చే ఆదాయం...** ఆదాయపన్ను నుంచి 22 శాతం, కేంద్ర ఎక్సైజ్ నుంచి 5 శాతం, జీఎస్టీ, ఇతర పన్నుల నుంచి 18 శాతం. కార్పొరేషన్ పన్ను ద్వారా 17 శాతం, కస్టమ్స్ ద్వారా... 4 శాతం, అప్పులతో కాని క్యాపిటల్ రిసిప్ట్స్ ద్వారా 1 శాతం, పన్నేతర ఆదాయం 9 శాతం, అప్పులు, ఇతర మార్గాల ద్వారా 24 శాతం ఆదాయం సమకూరుతుంది.

**కేంద్ర ఖర్చులు....** వడ్డీ చెల్లింపులకు 20 శాతం, కేంద్ర ప్రభుత్వ పథకాలకు 16 శాతం, కీలక సబ్సిడీలకు 6 శాతం, రక్షణ రంగానికి 8 శాతం, రాష్ట్రాలకు పన్నులు, డ్యూటీల ద్వారా చెల్లింపుల్లో 22 శాతం, ఫైనాన్స్ కమిషన్, ఇతర బదిలీల ద్వారా 8 శాతం, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలకు 8 శాతం, ఇతర ఖర్చులకు 8 శాతం, పెన్షన్స్‌లకు 4 శాతం.



### 140 కోట్ల ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్ ఇది: ప్రధాని మోదీ

కేంద్రంలో ఎన్డీయే సర్కార్ మూడోసారి కొలువుదీరిన తర్వాత ప్రవేశపెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌పై ప్రధాని నరేంద్రమోదీ స్పందించారు. ఇది 140 కోట్ల ప్రజల ఆశలు నెరవేర్చే బడ్జెట్ అని కొనియాడారు. దీంతో పొదుపు, పెట్టుబడులు పెరుగుతాయని ఆశాభావం వ్యక్తంచేశారు. ఈ పద్దు దేశాన్ని వికసిత్ భారత్ వైపు అడుగులు వేయిస్తుందని పేర్కొన్నారు. 'భారత అభివృద్ధి ప్రయాణంలో ఈ బడ్జెట్ ఒక ముఖ్యమైన మైలురాయి. ఇది 140 కోట్ల మంది భారతీయుల ఆకాంక్షలు నెరవేర్చే బడ్జెట్. అనేక రంగాల్లో యువతకు అవకాశాలను కల్పిస్తున్నాం. బడ్జెట్‌లు సాధారణంగా ఖజానాను నింపడంపై దృష్టి సారిస్తాయి. కానీ.. ఈ బడ్జెట్ మాత్రం ప్రజల జేబులు నింపేందుకు, సేవింగ్స్ పెంచేందుకు ఉద్దేశించింది. ఈ బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకూ ఎలాంటి పన్ను లేదు. అన్ని ఆదాయ వర్గాలకు పన్నులను తగ్గించారు. ఇది మధ్య తరగతి ప్రజలకు ఎంతో ప్రయోజనకరం" అని ప్రధాని పేర్కొన్నారు.



### ఛత్తీస్‌గఢ్‌లో భారీ ఎన్‌కౌంటర్.. 8 మంది మావోయిస్టులు మృతి

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పుల మోతతో దద్దరిల్లింది. బీజాపూర్ జిల్లా గంగలూర్ అటవీ ప్రాంతంలో ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో 8 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు అధికారులు వెల్లడించారు. గంగలూరు పోలీసు స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో పశ్చిమ బస్తర్ డివిజన్ మావోయిస్టులు నక్కినట్లు నిఘా వర్గాల నుంచి సమాచారం రావడంతో.. డీఆర్జీ, సీఆర్పీఎఫ్, కోబ్రా యూనిట్, ఎస్‌టీఎఫ్ బలగాలు యాంటీ నక్సలైట్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో భద్రతా దళాలను చూసిన మావోయిస్టులు కాల్పులకు తెగబడ్డారు. దీంతో సిబ్బంది ఎదురుకాల్పులు జరిపి మావోయిస్టులను హతమార్చారు. ఉదయం 8.30 గంటలకు మొదలైన ఎన్‌కౌంటర్ ఇంకా కొనసాగుతోందని అధికారులు వెల్లడించారు. అడవుల్లో మావోయిస్టుల కోసం గాలిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘటనాస్థలంలో ఆటోమేటిక్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు

### కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు సున్నా: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



హైదరాబాద్: కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ 2025-26లో తెలంగాణకు ఇచ్చింది సున్నా అని టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. తెలుగు కోడలు అయి ఉండి కూడా నిర్మలమ్మ తెలంగాణపై ప్రేమ చూపలేదన్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని అసహనం వ్యక్తం చేశారు. భాజపా తెలంగాణపై వివక్ష చూపిస్తోందని.. రాజకీయంగా రాష్ట్రాన్ని దెబ్బతీయాలని చూస్తోందని ఆరోపించారు. త్వరలో బిహార్ అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అక్కడ రాజకీయ లబ్ధి కోసం భాజపా కేంద్ర బడ్జెట్‌ను ఉపయోగించుకుంటోందని మండిపడ్డారు. తెలంగాణకు ఎన్నికల సమయంలో ప్రధాని మోదీ, భాజపా నాయకులు ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు, ఎంపీలు.. కేంద్ర మంత్రులను, ప్రధాన మంత్రిని కలిసి తెలంగాణకు రావాల్సిన అనేక అంశాలపై విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా కేంద్రం తెలంగాణకు అవసరమైన అంశాల్లో సహకారాన్ని అందించాలని కోరారు.




# అసెంబ్లీ సీట్లు పెరుగుతున్నాయ్..

## మొదలైన ప్రక్రియ..!

హైదరాబాద్ / అమరావతి : ఏపీలో అన్ని రాజకీయ పార్టీలు ఎదురు చూస్తున్న అసెంబ్లీ, పార్లమెంటు సీట్లను పెంచే క్రతువు ప్రారంభం కానుంది. విభజన చట్టం ప్రకారం.. రాష్ట్రానికి మరో 50 అసెంబ్లీ సీట్లు రావాల్సి ఉంది. ఇక, నియోజక ర్గాల పునర్ విభజన ప్రకారం.. 5-8 పార్లమెంటు స్థానాలు కూడా పెరగాల్సి ఉంది. వీటిపై ఎప్పటికప్పుడు చర్చ జరుగుతున్నా.. అడుగులు ముందుకు పడడం లేదు. కానీ, పార్టీలకు మాత్రం నియోజకవర్గాలు పెంచితే.. తమకు ఇబ్బందులు తప్పుతాయన్న అభిప్రాయం కనిపిస్తోంది. రాష్ట్రంలో నాయకుల సంఖ్య పెరుగుతోంది. యువతను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్న పార్టీలు కనిపిస్తున్నాయి. అదేసమయంలో అనూహ్య కారణాలతో కొత్త నేతలు కూడా అప్పటికప్పుడు పుట్టుకువస్తున్నారు. ఉదాహరణకు బాపట్ల ఎంపీ.. కృష్ణ ప్రసాద్ కొత్త నాయకుడు. అప్పటి వరకు రాజకీయ నేపథ్యం తక్కువే. కానీ, ఎన్నికల సమయంలో ఆయన టికెట్ పొందారు. దీనివల్ల.. సీనియర్లు, టికెట్ ఆశించిన వారు కూడా తప్పుకోవాల్సి వచ్చింది. ఇక, ఇతర నియోజకవర్గాల్లోనూ.. సిట్టింగులను తప్పించారు. ఇక, వైసీపీ విషయానికి వస్తే.. కొత్తతరం నాయకులను రాజకీయాలకు పరిచయం చేస్తోంది. దీంతో సీనియర్లను తప్పించి.. సామాజిక వర్గాల ఆధారంగా టికెట్లను పంపిణీ చేసింది. ఈ రెండు పార్టీల పరిస్థితి నాయకులు ఎక్కువ-అవకాశాలు తక్కువ అన్నట్టుగా మారింది. దీంతో వైసీపీ, టీడీపీలు రెండూ కూడా.. గతంలో అధికారంలో ఉనప్పుడు.. అసెంబ్లీ సీట్ల పెంపుపై కసరత్తు చేశాయి. 2017-18 మధ్య చంద్రబాబు దీనిపై పెద్ద తీర్మానమే చేసి కేంద్రానికి ఇచ్చారు. అయినప్పటికీ.. 2026 వరకు కుదరదని అప్పట్లో కేంద్రం తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలో తాజాగా ఏపీ, తెలంగాణలకు పునర్విభజన చట్టం ప్రకారం అసెంబ్లీ, దేశవ్యాప్తంగా జనాభా ఆధారంగా పార్లమెంటు నియోజకవర్గాలను పెంచేందుకు కేంద్రం కసరత్తు ప్రారంభించింది. దీనిపై పార్లమెంటు ఆమోదం పొందాల్సిన నేపథ్యంలో బడ్జట్ సమావేశాల రెండో విడతలో నియోజకవర్గాల పునర్ విభజనపై ముసాయిదా బిల్లును తీసుకురానున్నట్టు తెలిసింది. ఈ ప్రక్రియ ఇప్పుడు మొదలైతే.. ఆరు మాసాల సమయం పట్టనుంది. దీనిని తిరిగి ఈ ఏడాది ఆమోదిస్తే.. వచ్చే ఏడాది నుంచి నియోజకవర్గాల పెంపు జరుగుతుందని భావిస్తున్నారు.

# సంపాదకీయం

## కాంగ్రెస్ పునరుత్తేజానికి బీజేపీ బాటలు పరుస్తోందా ?

ఏపీలో రాజకీయం కాస్తా మూడు ప్రాంతీయ పార్టీల మధ్యనే కేంద్రీకృతమైంది. ఇందులో రెండు పెద్ద పార్టీలు ఉంటే మరో పార్టీ ఇపుడిపుడే బలాన్ని పెంచుకుంటోంది. ఇక చూస్తే 2014 నుంచి ఏపీ రాజకీయాల్లో జాతీయ పార్టీల పాత్ర నామమాత్రం అయింది. బీజేపీకి తెలుగుదేశంతో పొత్తు ఉంటేనే సీట్లు దక్కుతున్నాయి. లేకపోతే ఆ పార్టీ ఓటమి పాలు అవుతోంది. ఇది గడచిన మూడు ఎన్నికల్లో జరిగిన ఉదంతంగా చూస్తున్నారు. అయితే బీజేపీ గెలిచిన ప్రతీ సారి తన గొప్పతనం అనుకుంటోంది. ఏపీలో తాను బలపడాలని చూస్తోంది. 2014లో టీడీపీ అండతో జనసేన మద్దతుతో గెలిచిన బీజేపీ పరోక్షంగా వైసీపీతో దోస్తీ చేసి ఆ పార్టీకి ఊతం ఇచ్చింది అన్న ఆరోపణలు ఉన్నాయి. దాని వల్లనే విషయం మొత్తం చెడి 2018 నాటికల్లా టీడీపీ ఎన్డీయే నుంచి బయటకు రావడం జరిగింది. బీజేపీ ఆనాడు వైసీపీతో కలసి ఏపీలో రాజకీయంగా బలపడాలని అనుకుంది. అయితే 2019 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన వైసీపీ కేంద్ర ప్రభుత్వానికి పరోక్షంగా సాయం అందించింది కానీ బీజేపీతో పొత్తుని బాహాటంగా కుదుర్చుకునేందుకు ఒప్పుకోలేదు. ఫలితంగా మళ్ళీ టీడీపీతోనే పొత్తుకు సిద్ధపడాల్సి వచ్చింది. మరో వైపు చూస్తే 2014 కి 2024 కి మధ్యలో ఏపీ రాజకీయాల్లో భారీ మార్పులు వచ్చాయి. నాడు ఎన్నికల్లో పోటీ చేయని పవన్ జనసేన 2019లో సొంతంగా పోటీ చేసి ఉనికి చాటుకుంది. ఇక 2024 నాటి కూటమి ఏర్పాటులో కీలకమైన పాత్ర పోషించి పవన్ ఏపీ రాజకీయాల్లో కీలకంగా మారారు. ఇక పవన్ కి సినీ సెలబ్రిటీగా విపరీతమైన క్రేజ్ ఉంది. అంతే కాదు ఏపీలో బలమైన సామాజిక వర్గం దన్ను ఉంది. మరే రాజకీయ నేతకూ లేనంతగా యువత మహిళల మద్దతు ఉంది. దాంతో బీజేపీ పవన్ మీద కోటి ఆశలను పెంచుకుంది. పవన్ ని ముందు పెట్టుకుని రేపటి రోజున ఏపీలో బలపడాలని చూస్తోంది. ఈ క్రమంలో జగన్ తో బీజేపీకి అసలు అవసరం అన్నది లేదని అంటున్నారు. ఏపీలో పవన్ ప్లస్ బీజేపీ బలపడాలి అంటే పొలిటికల్ వాక్యూం క్రియేట్ కావాలని కమలనాధులు ఆలోచిస్తున్నారు. టీడీపీకి అపోజిట్ గా ఉన్న వైసీపీ నిర్వీర్యం కావడం వల్లనే ఆ రాజకీయ శూన్యత ఏర్పాడుతుందని అంచనా కడుతున్నారు. దానికి అవసరమైన ఇంధనాన్ని బీజేపీ ఇపుడు సమకూర్చి పెడుతోంది. వైసీపీని బీజేపీ గట్టిగా టార్గెట్ చేయడం వెనక ఉద్దేశ్యాలు వ్యూహాలు ఇవేనని అంటున్నారు. వైసీపీ అంతలా బలహీనం అయితే ఆ ప్లేస్ లో జనసేన బీజేపీ ఎమర్జ్ కావడానికి వీలు ఉంటుందని భావిస్తున్నారు. అయితే ఏపీలో జనసేన బీజేపీ టీడీపీల ఓటు బ్యాంక్ దాదాపుగా ఒక్కటే అని విశ్లేషణలు ఉన్నాయి. వైసీపీ ఓటు బ్యాంక్ అన్నది కాంగ్రెస్ నుంచి ట్రాన్స్ ఫర్ అయి వచ్చింది. మైనారిటీలు దళితులు బలమైన రెడ్డి సామాజిక వర్గం ఇలా వైసీపీ ఓటు బ్యాంకు ఉంది. అది ఎంత గట్టిది అన్నది 2024 ఎన్నికల్లో రుజువు అయింది అని గుర్తు చేస్తున్నారు. మూడు పార్టీలు కలసినా వైసీపీకి పడే ఓట్లను కదిలించలేక పోయారు అంటే అది వైసీపీ ఓటు బ్యాంకు గానే చూడాల్సి ఉందని అంటున్నారు. అంతే కాదు బీజేపీకి వ్యతిరేక భావజాలానికి వేరే రాజకీయ సిద్ధాంతానికి ఆ ఓటు బ్యాంకు నిదర్శనం అంటున్నారు. ఈ వర్గాలు వైసీపీ ఏపీలో బలంగా ఉందని అట్టిపెట్టుకొని ఉన్నాయి. అదే వైసీపీ వీక్ అయితే తిరిగి కాంగ్రెస్ ని ఆశ్రయిస్తాయి తప్పించి కూటమిలోని ఏ ఒక్క వర్గమూ వైపు వచ్చే సీన్ ఉండదని అంటున్నారు. ఏపీలో సాగుతున్న ఆపరేషన్ వైసీపీ వల్ల జగన్ రాజకీయంగా ఇబ్బంది పడితే ఆ ప్లేస్ లోకి జనసేన బీజేపీ కాంబో రావడం అంత సులువు కాదని అంటున్నారు. అదే టైం లో కాంగ్రెస్ ఎదిగేందుకు బ్రహ్మాండమైన చాన్స్ ఉంటుందని విశ్లేషిస్తున్నారు. బీజేపీ ఏపీలో బలపడేందుకు అవసరమైన రాజకీయ భూమిక లేదని కూడా గుర్తు చేస్తున్నారు. మొత్తం మీద బీజేపీ 2014 నుంచి 2019 వరకూ అనుసరించిన స్ట్రాటజీని మార్చి ఇపుడు జగన్ ని టార్గెట్ చేయడం వల్ల కాంగ్రెస్ కి మంచి రోజులు రావచ్చు అన్నది ఒక విశ్లేషణ గా ఉంది. మరి వైసీపీ అయితే ఎంత మేరకు వీటిని తట్టుకుని నిలబడుతుంది అన్నది చూడాల్సి ఉంది అంటున్నారు.

# ఈ సారైనా.. 'ఆశలు' పట్టాలెక్కేనా..?



కొత్తగూడెం: కొత్తగూడెం- కొవ్వూరు(ఏపీలోని తూర్పుగోదావరి జిల్లా) రైల్వేలైన్ నిర్మాణ అంశం ఇటీవల మరోసారి తెరపైకి వచ్చింది. సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ రైల్వేలైన్ నిర్మాణానికి కేంద్రం సుముఖత వ్యక్తం చేసింది. 1964లో ఈ లైన్ నిర్మాణానికి బీజం పడగా.. ఇప్పటివరకు 60ఏళ్లకు పైగా కేవలం ప్రకటనలకే పరిమితమైంది. స్థానిక ఎంపీలు అప్పుడప్పుడు పార్లమెంట్‌లో ప్రస్తావించినప్పుడు మాత్రమే కదలిక వచ్చినా అధికారులు సర్వేలతోనే సరిపెట్టేవారు. తాజాగా జరిగిన పార్లమెంట్ సమావేశాల్లో రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ కొవ్వూరు రైల్వేలైన్‌పై స్పష్టతనిచ్చారు. రాజమహేంద్రవరం ఎంపీ పురందేశ్వరి అడిగిన ప్రశ్నకు రూ. 2,115 కోట్లతో ఈ ప్రాజెక్టును 2030 నాటికి పూర్తిచేస్తామని లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

**కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ ఆధ్వర్యంలో..**

భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం)-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి వ్యతిరేకంగా కొత్తగూడెం కేంద్రంగా 1984లో కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ ఏర్పాటైంది. కొదమసింహ పాండురంగాచార్యులు అధ్యక్షతన ఏర్పడిన ఈ కమిటీ ఆధ్వర్యంలో రైల్‌రోకో వంటి వివిధ రకాల నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అన్ని వర్గాల ప్రజల నుంచి మద్దతు లభించటంతో కమిటీని సత్తుపల్లి, చంద్రుగొండ, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, వీఎంబంజర వంటి ప్రాంతాలకు విస్తరించారు. 2014 జనవరి 18 నుంచి 22 రోజుల పాటు కొత్తగూడెం నుంచి కొవ్వూరు వరకు పాదయాత్ర నిర్వహించారు. ఇందులో పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. అప్పటి నుంచి ఏదో ఒకరకంగా రైల్వేలైన్ సాధన కోసం ఈ కమిటీ ప్రయత్నిస్తూనే ఉంది.

**150 కి.మీ. దూరం, 2.30 గంటల సమయం ఆదా..**

కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ ఏర్పాటుతో హైదరాబాద్- విశాఖపట్నం మధ్య 150కి.మీ. దూరం తగ్గటంతో పాటు 2.30 గంటల ప్రయాణ సమయం ఆదా అవుతుంది. ప్రస్తుతం హైదారాబాద్ నుంచి విశాఖకు విజయవాడ మీదుగా వెళ్తే 800కి.మీ. ప్రయాణించాలి. అదే కొత్తగూడెం- కొవ్వూరు లైన్ పూర్తయితే హైదరాబాద్ నుంచి విశాఖకు వయా కొత్తగూడెం అందుబాటులోకి వస్తుంది. అప్పుడు 650కి.మీ. ప్రయాణంతోనే విశాఖకు చేరుకోవచ్చు. సింగరేణి సంస్థ, కేంద్ర ప్రభుత్వ సహకారంతో కొత్తగూడెం నుంచి సత్తుపల్లి వరకు 56.25కి.మీ. రైల్వేలైన్ పూర్తయ్యింది. సత్తుపల్లి నుంచి కొవ్వూరు వరకు మరో 95కి.మీ. లైన్ నిర్మించాల్సి ఉంది.

**ప్రతిసారీ నిరాశే..**

కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణానికి 1964లో ప్రతిపాదనలు రూపొందించి సర్వే చేశారు. కొన్ని కారణాల వల్ల పనులు పట్టాలెక్కలేదు. 2009లో రైల్వేశాఖ సహాయ మంత్రి కేహెచ్ మునియప్ప లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ప్రతిపాదిత బ్రాడ్‌గేజ్ లైన్‌కోసం తుది లొకేషన్ సర్వే పూర్తయిందని చెప్పారు. 2012-13లో మొదటి సారి రూ. 1,445కోట్లతో రైల్వేలైన్ మంజూరు చేయగా.. ఆతర్వాత రూ. 2,154.83కోట్లకు సవరించినట్లు అప్పటి మహబూబాబాద్ ఎంపీ సీతారాంనాయక్ లోక్‌సభలో పలుమార్లు ప్రస్తావించారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం ఈ రైల్వేలైన్ కోసం నిధులు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించటంతో ప్రజల్లో ఆశలు చిగురిస్తున్నాయి. కొత్తగూడెం-కొవ్వూరు రైల్వేలైన్ నిర్మాణానికి నిధులు మంజూరుచేయటం అభినందనీయం. ఈ లైన్ పూర్తయితే తెలంగాణ, ఏపీలోని సుమారు 200 గిరిజన గ్రామాలకు రైలు సదుపాయం అందుబాటులోకి వస్తుంది. విశాఖపట్నం, కాకినాడ పోర్టుల నుంచి సికింద్రాబాద్, నాగ్‌పూర్ వైపు సరకుల రవాణాకు ఈ మార్గం ఉపయోగపడుతుంది. కొదమసింహ పాండురంగాచార్యులు, కొవ్వూరు రైల్వేలైన్ సాధన కమిటీ అధ్యక్షుడు, కొత్తగూడెం

# సైన్స్ బలోపేతమే లక్ష్యం..



ఖమ్మం : ఫిబ్రవరి 25న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ(ఎస్‌సీఈఆర్‌టీ) వారు రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్‌ను నిర్వహించనున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అర్హులైన వారి నుంచి జిల్లా విద్యాశాఖ అధికారులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

**ఉప ప్రధాన అంశాలు..**

కృత్రిమ మేధస్సును సైన్స్ బోధనా అంశంగా అమలు పరచటం. పర్యావరణ సమతుల్యత, స్థిరమైన పర్యావరణ వ్యవస్థ నిర్వహణ కోసం వ్యూహాలు. పాఠశాలల్లో విద్యార్థుల శ్రేయస్సు కోసం ఆహార విద్య అమల్లో ఉపాధ్యాయుల పాత్ర. సైన్స్ విద్యా ప్రమాణాలను మెరుగుపర్చేందుకు అనుసరించాల్సిన శాస్త్రీయ మార్గాలు. రసాయనశాస్త్రాన్ని నేర్చుకునే ప్రధాన వనరుగా గృహం ఉన్నాయి.

**ఏం చేయాలి..**

రాష్ట్రస్థాయి సెమినార్ కోసం ఆసక్తి గల వారు తమ సెమినార్ పత్రాలను రాష్ట్ర విద్యా పరిశోధనా శిక్షణ సంస్థ వారు పేర్కొన్న నిర్ణీత నమూనాలో రాసి పంపాలి.

**సెమినార్ ఉద్దేశాలు, లక్ష్యాలు..**

సైన్స్ విద్యావిధానం-బోధనలో అభివృద్ధి చెందుతున్న నూతన ధోరణులను అన్వేషించటం కోసం బోధించటంలో కొత్త పద్ధతులను అమలు చేయడం. వ్యక్తులు, సమాజం యొక్క సమకాలీన అవసరాలకు, సవాళ్లకు అనుగుణంగా సైన్స్ విద్యను బలోపేతం చేయడం. సైన్స్ సంబంధిత శాస్త్రీయ భావనలను వర్తింపజేయటంలో విద్యార్థులకు మార్గనిర్దేశనం చేయటం వంటి లక్ష్యాలు ఉన్నాయి.

**పేపర్లు దేని ఆధారంగా ఉండాలి..**

చర్యాత్మక పరిశోధన లేదా పరిశోధన ఆధారిత కథనాలు. తరగతి గదిలో అనుసరిస్తున్న బోధనా విధానాలకు సంబంధించినవి, ఇంగ్లిషు, తెలుగు, ఉర్దూ భాషల్లో రాసి పేపర్లను పంపించవచ్చు.

**ఎవరెవరు అర్హులు..**

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులు, డైట్ లెక్చరర్లు, విద్యా కళాశాలల అధ్యాపకులు, ఇతర క్షేత్రస్థాయి సైన్స్ సిబ్బంది, విద్యా విధానం కోసం తపన పడుతూ, సైన్స్‌తో అనుబంధం ఉన్న ప్రభుత్వేతర సంస్థల్లో పనిచేసే వారు, జిల్లా స్థాయిలో ఐఏఎస్ఈఎస్, సీటీఈఎస్, డైట్ ప్రిన్సిపల్స్, ప్రైవేటు డీఈఐఈడీ, బీఈడీ కళాశాలల అధ్యాపకులు, ఛాత్రోపాధ్యాయులు, విద్యా పరిశోధకులు సైన్స్ సెమినార్‌కు తమ పత్రాలు సంబంధిత ఈమెయిల్స్ ద్వారా పంపాల్సి ఉంటుంది. పత్రాలు పంపేందుకు తుది గడువు వచ్చే జనవరి 20. వాటిని స్క్రీనింగ్ చేసిన తర్వాత ఎంపిక చేసిన అభ్యర్థులకు సమాచారం అందిస్తారు. ఎంపికైన వారు పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను తయారు చేసుకుని సెమినార్‌లో పాల్గొని అందరికీ వివరించాల్సి ఉంటుంది.

**గతేడాది..**

గతేడాది రాష్ట్రస్థాయి సైన్స్ సెమినార్ అంశం 'శాస్త్రీయ విద్యలో వెలుగొందుతున్న భారతావని' అనే అంశం నుంచి రాష్ట్రస్థాయికి 31 పేపర్లు ఎంపిక కాగా వీటిలో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు ఎంపికయ్యారు.

# ప్రపంచ దేశాల్లో 'విజయ్' యాత్ర

ఖమ్మం : సెలవులు వచ్చాయంటే చాలామందికి సరదాగా గడపటం అలవాటు. వారాంతంలో, ఎక్కువ సెలవులు వచ్చిన సందర్భంలో సమీపంలోని ప్రాంతాలను చుట్టేస్తుంటారు. కానీ ఓ యువకుడు మాత్రం విదేశాలను తిరగటం అలవాటుగా మార్చుకున్నాడు. ఖమ్మం నగరానికి చెందిన చెరుకూరి విజయ్‌కృష్ణ ఇప్పటివరకు 55 దేశాల్లో పర్యటించారు.

**ఆదా చేస్తూ..** తరచూ వివిధ దేశాల్లో పర్యటించటం ఖర్చుతో కూడుకున్న పనే అయినా ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నానని విజయ్‌కృష్ణ చెబుతున్నారు. తక్కువ ఖరీదు కలిగిన టికెట్లను కొనుగోలు చేయటం, స్థానికుల ద్వారా పరిచయాలు పెంచుకుని ఆతిథ్యం స్వీకరిస్తుండటం, తదితర వాటి ద్వారా 50శాతం ఖర్చును ఆదా చేస్తున్నానని తెలిపారు. ప్రతి దేశ పర్యటన సందర్భంగా అక్కడి చారిత్రక ప్రాంతాలు, కొండలు, జలపాతాలను సందర్శించేందుకు ఎక్కువ ఆసక్తి చూపుతానని వివరించారు. 'ప్రపంచ దేశాలన్నీ తిరగటం నా లక్ష్యం. కొత్తకొత్త ప్రాంతాల్లో తిరగటం వల్ల మానసికోల్లాసం కలుగుతుంది. పని ఒత్తిడి నుంచి దూరమయ్యేందుకు వివిధ దేశాలో పర్యటించాలని నిర్ణయించుకున్నా. తద్వారా భిన్న సంస్కృతులు, సంప్రదాయాలను తెలుసుకునే అవకాశం కలిగింది' అని చెరుకూరి విజయ్‌కృష్ణ 'ఈనాడు'కు తెలిపారు.




**సెలవుల్లో సరదాగా ప్రయాణం**

చెరుకూరి విజయ్‌కృష్ణ ప్రస్తుతం స్వీడన్‌లోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ కంపెనీలో మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. సెలవులు దొరికినప్పుడు దేశాలను చుట్టేస్తున్నారు. ఇప్పటికే యూరప్ ఖండంలోని దేశాలన్నింటినీ సందర్శించారు. ఆయా ప్రాంతాల్లో విభిన్న సంస్కృతులను పరిశీలిస్తున్నారు. ప్రతి దేశాన్ని అద్భుతంగా చిత్రీకరించి తన అనుభవాలను ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకుంటున్నారు. కొన్ని దేశాల పర్యటన సందర్భంగా భాషాపరమైన ఇబ్బందులు, ఆహార సమస్యలు ఎదురవుతున్నప్పటికీ స్థానికుల సహకారంతో వాటిని అధిగమిస్తున్నారు.

# కటాఫ్ తేదీ ఎత్తివేత ఎప్పుడో!

జగిత్యాల : రాష్ట్రప్రభుత్వ వైఖరి వేలాదిమంది బీడీకార్మికుల పాలిట శాపంగా మారింది. 2014 ఫిబ్రవరి 28 వరకు పీఎఫ్ ఖాతాలో నమోదైనవారికే జీవనభృతి పింఛన్లు అందిస్తున్నారు. కటాఫ్ తేదీ తరువాత పీఎఫ్ కార్డు వచ్చినా ప్రభుత్వం పింఛన్‌కు పరిగణనలోకి తీసుకోలేదు. మరోవైపు 2022 ఆగస్టులో కేవలం నిజామాబాద్ జిల్లాలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ అమల్లోకి రాకపోగా ఇతర జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. భారాస రెండుసార్లు అధికారంలో ఉన్నపుడు కటాఫ్ తేదీని ఎత్తివేయకపోగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడచినా ఎత్తివేయక అర్హులైన వేలాదిమంది ప్రభుత్వ ఆసరాకు దూరమయ్యారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా పీఎఫ్ ఖాతాకలిగిన ప్రతిఒక్కరూ ఆసరా పింఛన్‌కు దరఖాస్తు చేయాలని గతంలో ప్రభుత్వం సూచించటంతో వేలాదిమంది దరఖాస్తు చేశారు. 18-50 ఏళ్లలోపు వయసువారు 1.5 లక్షల్లోపు ఆదాయం కలిగి, ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, బ్యాంకుఖాతా, రేషన్‌కార్డు, ఈపీఎఫ్ అపాయింట్మెంట్‌లెటర్, ఆన్‌లైన్ స్టేట్మెంటు, పాస్‌పోర్టుసైజు ఫొటోతో ఎంపీడీవో కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో అందించారు. కానీ వీరికి ఇప్పటికీ పింఛన్ మంజూరు



కాలేదు. పూర్వపు కరీంనగర్ జిల్లాలోని లక్షలాదిమందికి దశాబ్దాలుగా ఉపాధి కల్పించిన బీడీ పరిశ్రమ క్రమంగా సంక్షోభంలో కూరుకుపోతోంది. ఆసరా ఫించన్ పొందుతున్న బీడీ కార్మికుల సంఖ్యరీత్యా జగిత్యాల జిల్లా రాష్ట్రంలోనే రెండోస్థానంలో ఉండగా సిరిసిల్ల జిల్లా నాలుగోస్థానంలో ఉండటం ఇక్కడివారి అనుబంధ ఉపాధిని వెల్లడిస్తోంది. జగిత్యాల, కోరుట్ల, సిరిసిల్ల, మెట్పల్లి, వేములవాడ, రాయికల్ తదితర ప్రధాన పట్టణాలు, మండలాలు, పల్లెల్లోనూ బీడీ పరిశ్రమ ఆధారితంగా వేలాదిమంది జీవనం సాగిస్తున్నారు. స్థానికంగా 46 వరకు బీడీ కంపెనీలుండటం ఇక్కడి బీడీ పరిశ్రమ ప్రాధాన్యతను వెల్లడిస్తోంది. పల్లెలు, పట్టణాలని తేడాలేకుండా చాలామంది బీడీలు చుట్టడాన్ని ఉపాధిగా మలచుకోగా బీడీ తయారీ ఉత్పత్తులపై జీఎస్టీ ప్రభావం, చవకరకం సిగరెట్ల పోటీతో బీడీలకు మార్కెట్లో గిరాకీ తగ్గి ప్రస్తుతం నెలలో తగినన్ని పనిరోజులు లేనందున కార్మికులు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో పీఎఫ్ కటాఫ్ తేదీని ఎత్తివేసి బీడీలు చుట్టేవారితోపాటుగా ఇతర కార్మికులకు పింఛన్ మంజూరీ, బీడీల తయారీకి తగినట్లు తునికాకును సరఫరా, బీడీల తయారీ ధరను పెంచటం, ప్రధాని ఆవాస్ యోజనద్వారా ఒక్కో ఇంటికి రూ. 1.50 లక్షల రాయితీ ఇవ్వటం, గతంలో మాదిరిగా ప్రభుత్వం సంక్షేమ నిధిని పునరుద్ధరించి తమ పిల్లలకు ఉపకార వేతనాల మంజూరు, ఈఎస్ఐ కార్మిక ఆసుపత్రి ద్వారా వైద్యసేవలు అందించటం, అన్ని రకాల ప్రభుత్వ సంక్షేమ పథకాలను వర్తింపుతోనే తమ మనుగడ సాగుతుందని కార్మికులు పేర్కొంటున్నారు.

# అన్నదాత ఇంట.. సిరుల పంట

పెద్దపల్లి : జిల్లాలో ఈ ఏడాది వానాకాలంలో అన్నదాత పంట పండింది. సన్న ధాన్యానికి క్వింటాలుకు రూ. 500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రచారం సత్ఫలితాలనిచ్చింది. గతంతో పోలిస్తే ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం పెరిగింది. వాతావరణ పరిస్థితులతో అధికారులు అంచనా వేసిన దాని కంటే ధాన్యం దిగుబడి స్వల్పంగా తగ్గింది. బోనస్ చెల్లింపుతో రైతులకు గిట్టుబాటు కలిగింది. ఈ సీజన్‌లో ఎలాంటి సమస్యలు లేకుండా ధాన్యం సేకరణ సజావుగా పూర్తి కావడంతో అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది. త్వరితగతిన రైతుల ఖాతాల్లో డబ్బులు జమ కావడం ఊరట కలిగించింది.

**50 వేల ఎకరాలు అధికం**

వానాకాలంలో 2.09 లక్షల ఎకరాల్లో వరి సాగయింది. ఇందులో 1.72 లక్షల ఎకరాల్లో సన్న రకం, 36 వేల ఎకరాల్లో దొడ్డు రకం వేశారు. ఈ సీజన్‌లో సన్న వరి సాగు విస్తీర్ణం 50 వేల ఎకరాలు పెరిగింది. ఈ మేరకు 3.50 లక్షల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 90 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం దిగుబడి రానుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. వరి పైర్లు పొట్ట దశలో ఉన్నపుడు వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడంతో ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు దిగుబడి తగ్గింది. జిల్లాలో ఇప్పటివరకు దొడ్డు రకం ధాన్యాన్ని ప్రభుత్వ కేంద్రాల్లో 64 వేల టన్నులు, మిల్లర్లు నేరుగా 30 వేల టన్నులు కొనుగోలు చేశారు. సన్న ధాన్యానికి సంబంధించి 2.18 లక్షల టన్నులను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో సేకరించగా మరో 20 వేల టన్నులు కొనుగోలు చేయాల్సి ఉంది. రైతులు సొంత అవసరాలకు మరో 30 వేల టన్నులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు.

**కలిసొచ్చిన అధికారుల ప్రచారం**

గోదావరి, మానేరు, ఎస్సారెస్పీ ఆయకట్టు పరిధిలో నీటి వనరులు సమృద్ధిగా ఉండటంతో జిల్లాలో సన్న వరి సాగు వైపు రైతులు మొగ్గు చూపారు. సీజన్ ఆరంభం నుంచే బోనస్ చెల్లింపుపై అధికారులు ప్రచారం చేశారు. ఊహించినట్లుగానే రైతులకు బోనస్ లాభదాయకంగా మారింది. క్వింటాలుకు రూ. 500 చెల్లిస్తుండటంతో పెట్టుబడుల భారం తప్పుతోంది. జిల్లాలో ఇప్పటివరకు 50,523 మంది రైతుల నుంచి రూ. 658.74 కోట్ల విలువైన 2.83 లక్షల టన్నుల ధాన్యం సేకరించారు. ఇందులో 48,538 మందికి రూ. 657.03 కోట్లు చెల్లించారు. 1.98 లక్షల టన్నుల సన్న ధాన్యం వివరాలు ఆన్‌లైన్ చేయగా మొత్తం రూ. 99 కోట్ల బోనస్ చెల్లించాల్సి ఉండగా రూ. 75.59 కోట్లు జమయ్యాయి.


**ఆర్థిక భారం తీరింది**

నాకున్న మూడున్నర ఎకరాలతో పాటు మూడెకరాలు కౌలుకు తీసుకొని సన్న వరి సాగు చేశా. తెగుళ్ల నివారణ చర్యలు తీసుకున్నా. మొత్తం 160 క్వింటాళ్ల దిగుబడి రాగా ప్రభుత్వం నుంచి రూ. 80 వేల బోనస్ వచ్చింది. పెట్టుబడి ఖర్చులకు ఆర్థిక భారం తీరింది. -మార్త దేవేందర్, మచ్చుపేట, ముత్తారం మండలం

**రూ.1.35 లక్షల బోనస్** తొమ్మిదెకరాల్లో సన్న వరి వేశా. ఎకరాకు 30 క్వింటాళ్ల చొప్పున 270 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. మొత్తం రూ. 1.35 లక్షల బోనస్ వచ్చింది. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రైతులకు ప్రోత్సాహకంగా ఉంది. ఏటికేడు సాగు ఖర్చులు పెరుగుతుండగా బోనస్ చెల్లింపులు మాకెంతో అండగా నిలిచాయి. -గంధం మహేందర్, మల్లాపూర్, ధర్మారం

# చిన్నేరు.. ఎన్నాళ్లీ కన్నీరు

భువనగిరి : చిన్నేరు వాగుపై లోలెవల్ కాజ్‌వే వంతెనతో భువనగిరి, బీబీనగర్ మండల ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. భువనగిరి మండలం అనాజిపురం నుంచి బీబీనగర్ మండలం జంపల్లి వరకు గల ఈ మార్గంలో రావిపహాడ్ వద్ద 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరుకుంది. రోడ్డుపై పెద్ద గుంతలతో రాళు మొనదేలి ప్రమాదకరంగా మారింది. ప్యారాపెట్‌వాల్స్(రక్షణ దిమ్మెలు)లేక రాత్రి సమయాల్లో వాహనదారులకు ప్రమాదాలు జరిగిన ఘటనలు చోటు చేసుకున్నాయి. ఈ మార్గంలో సుమారు 15 గ్రామపంచాయతీలకు చెందిన వేలాది మంది ప్రజలు ద్విచక్రవాహనాలు, కార్లు, నడక ద్వారా నిత్యం రాకపోకలు జరుపుతారు. పలు తండాలకు చెందిన రైతులు అనాజిపురం శివారులోని వ్యవసాయ భూములకు, విద్యార్థులు చదువుల నిమిత్తం వచ్చి వెళుతుంటారు. వానాకాలంలో జంపల్లి, రెడ్డినాయక్‌తండా, గొకిరితండా, రావిపహాడ్‌తండాతో పాటు వివిధ గ్రామాల ప్రజలు మగ్దుంపల్లి, బీబీనగర్ మీదుగా చుట్టూ సుమారు 15 నుంచి 20 కి.మీ దూరం తిరిగి రావాల్సి ఉంటుంది. అనాజిపురం వచ్చే పాఠశాల విద్యార్థులు, వివిధ అవసరాలు, వ్యాపారాలు చేసుకునే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయి. గత ఏడాది ఆగస్టు నెలలో ప్రజల కష్టాలను వెలుగులోకి తీసుకురాగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి స్పందించి సంబంధిత జిల్లా అధికారులను



ఆదేశించగా పూర్తిస్థాయిలో సర్వే జరిపి రూ.16 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు.

**ప్రమాదాలకు నెలవు..**

వాగుపై వరద ఉధృతికి రావిపహాడ్ గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన కావలి నర్సయ్య, భార్య నర్సమ్మ ఒకరి చేయి మరొకరు పట్టుకొని నీటిలో నడుచుకుంటూ వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు నీటి ఉధృతికి కాల్వలో పడి మృతి చెందారు. ఇతర గ్రామాలకు చెందిన మరో ముగ్గురు ద్విచక్రవాహనాలపై వెళుతూ నీట మునిగి ప్రాణాలు వదిలారు..

**రైతుల భూములకు వెళ్లాలంటే అవస్థలు..:** 50ఎకరాల వ్యవసాయ భూములు, గేదెల షడ్లు ఉన్నాయి. ఉదయం వెళ్లే సమయంలో తక్కువ నీళ్లే ఉంటాయి. తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఉృతి పెరిగి ప్రమాదకరంగా మారుతుంటుంది. ఆ సమయంలో చాలా అవస్థలు పడుతూ సుమారు 20 కిమీ చుట్టూ తిరుగుతూ ఇంటికి చేరుకోవాల్సి వస్తుంది.

**ప్రతిపాదనలు పంపించాం**

బాల ప్రసాద్, రోడ్డు భవనాల శాఖా ఈఈ

రావిపహాడ్ వద్ద చిన్నేరు వాగుపై హైలెవల్ వంతెన నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపించాం. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు పూర్తి స్థాయిలో సర్వే జరిపి, రూ.16కోట్లతో ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపించారు. ముఖ్యమంత్రి దృష్టిలో ఉంది.

పాల వ్యాపారం చేస్తుంటాను

పాశం నర్సిరెడ్డి, మాధారం, బీబీనగర్ మండలం

వ్యవసాయం చేస్తుంటాను. నాకు గేదెలున్నాయి. పాలు తీసుకొని వెళ్లి అనాజిపురం, భువనగిరి తదితర ప్రాంతాలలో విక్రయిస్తుంటాను. చిన్నేరు వాగుపై నీటి పెరిగినప్పుడు మగ్దుంపల్లి మీదుగా చుట్టూ తిరుగుతూ వెళ్లాల్సి ఉంటుంది.

మా పొలాలున్నాయి

బానోతు బిచ్చానాయక్, రావిపహాడ్ తండా

మా తండాలకు చెందిన భూములు చాలా వరకు అనాజిపురం రెవెన్యూలో ఉన్నాయి. వాగు దాటి వెళ్లాలి. వాగుపై వరద ఉధృతి పెరిగినప్పుడు రోడ్డు మూసి వేస్తారు. ఆ సమయంలో పొలాలకు వెళ్లాలంటే చుట్టూ (సుమారు 15కిమీ)తిరిగి వెళ్లాలి.

# ప్రకృతి వనం.. పట్టని వైనం

కోదాడ : పట్టణాల్లో కాలుష్యాన్ని తగ్గించి, పచ్చదనం పెంచే లక్ష్యంగా ప్రభుత్వం పట్టణ ప్రకృతి వనాలను ఏర్పాటు చేసింది. వాటి నిర్వహణ మాత్రం అధ్వానంగా ఉంది. మొక్కలు, చెట్లు పెరగాల్సిన ప్రాంతంలో గడ్డి మొక్కలు పెరిగి కనిపిస్తుండటంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. రూ.లక్షలు వెచ్చించి ఒక్కో పట్టణ ప్రకృతి వనాలు ఏర్పాటు చేస్తే, పదుల సంఖ్యలో కూడా మొక్కలు పెరగని దుస్థితి నెలకొంది. అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ నిధులు వృథా అవుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా క్షేత్రస్థాయిలో పర్యటించి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



**బీడు భూమిని తలపిస్తూ..**

పచ్చదనంతో కళకళలాడాల్సిన ప్రకృతి వనాలు బీడు భూములను తలపిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో 19 పురపాలికలు ఉండగా, వీటిలో 300లకు పైగా పట్టణ ప్రకృతి వనాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రకృతి వనానికి బోర్డు, గేటు, స్థలం చుట్టూ రాతి స్తంభాలతో ఫెన్సింగ్, విద్యుత్, బోరు, మొక్కలు ఇలా అన్ని ఏర్పాట్లకు రూ.10 కోట్లకు పైగా ఖర్చయింది. నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. కొన్ని వనాల్లో కనీసం బోరు కూడా లేదు. ట్యాంకర్లతో ఎప్పుడో ఒకసారి నీళ్లు పోస్తుండటంతో అవి వాడిపోతున్నాయి. స్థలం చుట్టూ ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ స్తంభాలు, విలువైన తీగ, గేట్లను గుర్తు తెలియని దుండగులు అపహరించుకుపోతున్నారు.

**నిర్వహణపై దృష్టి సారిస్తాం: రమాదేవి, పుర కమిషనర్, కోదాడ**

పట్టణంలోని పట్టణ ప్రకృతి వనాల్లో మొక్కలు ఎండిపోయినట్లు మా దృష్టికి వచ్చింది. క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలు తీసుకుంటాం. పచ్చదనమే లక్ష్యంగా మొక్కలు పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటాం.

# భాషా నైపుణ్యం.. వ్యక్తిత్వ వికాసం



పెద్దపల్లి : ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఆంగ్లంలో ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నారు. గతేడాది తొలిసారిగా ప్రథమ సంవత్సరం విద్యార్థులకు అమలు చేయగా, ఈసారి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఏర్పాటు చేశారు. మొత్తం వంద మార్కులకు గాను ప్రయోగాలకు 20 కేటాయించగా, మిగతా 80 మార్కులకు పరీక్ష రాయాల్సి ఉంటుంది. నాలుగు దశల్లో నిర్వహించే ప్రయోగ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణత సాధించనున్నారు. పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా ప్రకటిస్తున్నారు. ఈ నెల 31, ఫిబ్రవరి 1వ తేదీల్లో పరీక్ష నిర్వహించనున్నారు.

**నాలుగు విడతల్లో నిర్వహణ**

ప్రయోగ పరికరాలతో కాకుండా తరగతి గదిలోనే విద్యార్థుల భాషా సామర్థ్యాలను పరీక్షిస్తారు.

మొదటి దశలో ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థుల మధ్య ఆంగ్ల సంభాషణను అధ్యాపకులు పరీక్షిస్తారు.

రెండో దశలో 'జస్ట్ ఎ మినిట్' పేరిట ఒక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది.

మూడో దశ 'రోల్‌ప్లే'లో తల్లిదండ్రులు, లేక మరేదైనా అంశంపై విద్యార్థుల మధ్య బృంద చర్చ ఉంటుంది.

నాలుగో దశ 'లిజనింగ్ కంప్రహెన్సివ్'లో వినే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు.

చివరగా విద్యార్థుల రాసిన రికార్డులను తనిఖీ చేసి మార్కులు కేటాయిస్తున్నారు.

31 నుంచి ప్రయోగ పరీక్ష

ఉమ్మడి జిల్లాలో మొత్తం 197 కళాశాలల్లో 41,861 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ చదువుతున్నారు. ఆంగ్ల ప్రయోగ పరీక్షను ఈ నెల 31న ప్రథమ సంవత్సరం వారికి, ఫిబ్రవరి 1న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహిస్తారు. పరీక్షలో మొదటి మూడు దశలను కళాశాల యజమాన్యం వెసులుబాటు ఆధారంగా నిర్వహించారు. చివరి విడతలో మాత్రం ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించిన తేదీలో ఏర్పాటు చేయాలి. విద్యార్థుల భవితకు కొలమానంగా ఉన్న ఈ పరీక్ష నిర్వహణపై ఉన్నతాధికారులు పకడ్బందీగా పర్యవేక్షిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో నామమాత్రంగా కాకుండా విద్యార్థుల ప్రతిభ ఆధారంగా పరీక్ష నిర్వహించనున్నారు.

**నేడు పర్యావరణ విద్య**

ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు గతంలో విలువలు, పర్యావరణ విద్య పరీక్షలు నిర్వహించేవారు. ఇందులో ప్రాజెక్టు రూపొందించి నివేదిక సమర్పిస్తే 40 మార్కులు, పరీక్షకు మరో 60 మార్కులు కేటాయించేవారు. గతేడాది విలువల విద్య రద్దు చేసి పర్యావరణ విద్యపై మాత్రమే పరీక్ష నిర్వహిస్తున్నారు. గురువారం ఈ పరీక్ష నిర్వహించనున్నారు.

**తప్పనిసరిగా హాజరు కావాలి**

విద్యార్థులు ఆంగ్ల భాషపై పట్టు సాధించేందుకు ప్రయోగ పరీక్ష నిర్వహిస్తున్నాం. ఇందులో తప్పనిసరిగా ఉత్తీర్ణులు కావాల్సి ఉంటుంది. 20 మార్కులు కేటాయించడంతో పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ప్రతి విద్యార్థి తప్పకుండా హాజరు కావాలి. కల్పన, ఇంటర్మీడియట్ పెద్దపల్లి జిల్లా నోడల్ అధికారి

ఉమ్మడి జిల్లాలో ఇంటర్ విద్యార్థులు

కరీంనగర్ 12,641

జగిత్యాల 11,887

పెద్దపల్లి 10,566

రాజన్న సిరిసిల్ల 6,767

# గోదా'వరి'తో సాగు

సిద్దిపేట : యాసంగిలో చాలా మంది రైతులు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ఆధారంగావరి పంట వేశారు. ఈసారి సుమారు 3 లక్షల ఎకరాలకుపైగా సాగయ్యే అవకాశాలున్నట్లు అధికారుల అంచనా. ఇది మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ప్రభుత్వం సన్న ధాన్యానికి రూ.500 బోనస్ ఇవ్వడంతో కర్షకులు వరి వైపు మొగ్గుచూపుతున్నారు. ఇప్పటికే వేసిన నాట్ల కొన్ని చోట్ల ఎండిపోతుండటంతో ప్రాజెక్టుల నుంచి సాగునీరు వదలాలని రైతులు డిమాండు చేస్తున్నారు. జిల్లాలో పలు చోట్ల ఇటీవల ఆందోళనలు సైతం చేపట్టారు. ఫిబ్రవరి రెండో వారం వరకు నాట్లు పూర్తి కానున్నాయి. సాగుకు గోదావరి జలాలు ఆదరువు కానున్నాయి. జిల్లా వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాల ప్రత్యక్ష ఆయకట్టుంది. చెరువులు, వాగులు, కుంటల్లోకి



నీరు చేరితేనే పంటలు గట్టెక్కనున్నాయి.

**నీటి పారుదల శాఖ మంత్రికి వినతి**

బోర్లు తట్టి పోస్తుండటం, చెరువు, కుంటలు, వాగుల్లో నీరు లేకపోవటంతో భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయని, ప్రభుత్వం వెంటనే గోదావరి జలాలు విడుదల చేయాలని రైతులు డిమాండు చేస్తున్నారు. కర్షకుల పక్షాన ఇటీవలే దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన అధికారులు మల్లన్నసాగర్ నుంచి కొండపోచమ్మ కాలువ ద్వారా కూడవెల్లి వాగులోకి నీటిని విడుదల చేశారు. చెక్‌డ్యామ్‌లు నిండిన తర్వాత వారం అనంతరం నిలిపేస్తామని అధికారులు చెబుతున్నారు. గోదావరి జలాలు విడుదల చేయక వెలవెలబోతున్న హల్దీవాగు చెక్‌డ్యామ్

**రంగనాయక్ సాగర్ ఎడమ కాలువ ద్వారా..**

జనవరి 18న మంత్రి కొండా సురేఖ రంగనాయక సాగర్ ఎడమ కాలువ ద్వారా నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం కొనసాగుతోంది. కుడి కాలువకు విడుదల చేయాల్సి ఉంది. కొండపోచమ్మ సాగర్ నుంచి రామాయంపేట, జగదేవపూర్ కాలువ ద్వారా రోజుకు సుమారు 65 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. హల్దీవాగు, గజ్వేల్ కెనాల్‌కు నీటిని విడుదల చేయాల్సి ఉంది. గతేడాది ఫిబ్రవరిలో అవసరమైన మేర గోదావరి నీటిని వదిలామని, ప్రస్తుతం ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా వ్యవహరిస్తామని నీటి పారుదల శాఖ గజ్వేల్ ఈఈ మోతియా తెలిపారు.

ప్రస్తుత నీటి నిల్వ(టీఎంసీలలో)

అనంతగిరి 3.01

రంగనాయక సాగర్ 2.34

మల్లన్నసాగర్ 17.5

కొండపోచమ్మసాగర్ 9.1

# రాణా గడప తొక్కని గిరిజన పల్లె



ధర్మపురి: సమష్టి జీవనానికి ప్రతీకగా నిలుస్తోంది ధర్మపురి మండలంలోని ఆకుసాయిపల్లె గ్రామం. వందశాతం గిరిజనులు ఉన్న ఈ గ్రామం నుంచి ఎవరూ ఠాణా మెట్లెక్కలేదు. వివాదాలు, ఘర్షణలు ఏమీ తెలియని పల్లె. ఇక్కడి ప్రజలంతా శాంతి, సహనాలతో, సోదర భావంతో మెలుగుతున్నారు. దశాబ్దాలుగా ఒకరికి ఒకరు అండగా ఉంటూ ఎలాంటి వివాదాలు లేకుండా జీవనం గడుపుతున్నారు. ధర్మపురి నుంచి జగిత్యాల వైపు వెళ్లే జాతీయ రహదారి పక్కనే ఉంది ఈ పల్లె. **అభివృద్ధిలో...**

ప్రభుత్వ పథకాల అమలులో సైతం ఇక్కడి ప్రజలు ఆదర్శంగా నిలుస్తున్నారు. స్వచ్ఛత, పరిశుభ్రత, మొక్కల పెంపకంలో అందరు కలిసికట్టుగా భాగస్వాములవుతున్నారు. ఈ పల్లెలో ఏడు స్వశక్తి సంఘాలుండగా, రూ.20 లక్షల వరకు రుణాలు తీసుకున్నారు. వాటిని సమృద్ధిగా వినియోగించుకుంటూ సంఘాల పటిష్ఠతకు కృషి చేస్తున్నారు. ప్రాథమిక పాఠశాలలో 30 మంది విద్యార్థులున్నారు. పిల్లలకు మెరుగైన విద్యాబుద్ధులు నేర్పేందుకు వారి తల్లిదండ్రులు కృషి చేస్తున్నారు. ప్రతిరోజు క్రమం తప్పకుండా విద్యార్థులను పాఠశాలకు పంపుతున్నారు. ప్రధాన రోడ్ల వెంట మొక్కలు నాటి సంరక్షణ బాధ్యతలను విద్యార్థులకు అప్పగిస్తున్నారు. ఈ గ్రామం అయిదేళ్ల క్రితం నూతనంగా పంచాయతీగా ఏర్పడింది. పల్లె ప్రగతి కార్యక్రమాన్ని ఇక్కడ వంద శాతం చేపట్టారు. సమీపంలోని చెరువే స్థానికులకు ప్రధాన నీటి వనరు. ఈ చెరువు కిందే పత్తి, వరి, మొక్కజొన్న పంటలను సాగు చేస్తున్నారు. పదేళ్ల క్రితం వరకు ఏమాత్రం సదుపాయాలు లేని ఈ పల్లెలో నేడు మెరుగైన రహదారులు, అంతర్గత సీసీ రోడ్లు, మురుగు కాలువలు, తాగు నీరు, విద్యుత్తు సరఫరా, అంగన్‌వాడీ కేంద్రాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

**వర్షాధారంగానే పంటలు**

ఆకుసాయిపల్లె గ్రామంలో వర్షాధారంగానే పంటలను పండిస్తున్నారు. నేరెళ్ల గుట్టపై నుంచి వచ్చే నీరు సమీపంలోని బ్రాహ్మణకుంట వద్దకు చేరుతుంది. చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టి ఈ నీటి ఆధారంగానే సాగు చేస్తున్నారు. మిర్చి, మొక్కజొన్న, పత్తి పంటలను పండిస్తున్నారు.

**రికార్డులోనే లేదు**

ధర్మపురి మండలంలో 29 గ్రామాలుండగా ఆకుసాయిపల్లె నేటికీ పోలీసు రికార్డులోకి ఎక్కలేదు. మిగతా అన్ని గ్రామాల్లో వివిధ రకాల కేసులు నమోదయ్యాయి. ఈ పల్లెల్లో ప్రజలు సోదర భావంతో మెలుగుతున్నారు. ఈ గ్రామం సమష్టి జీవనానికి ప్రతిబింబంగా నిలుస్తోంది. ఉదయ్ కుమార్, ఎస్సై, ధర్మపురి

**ఏళ్లతరబడి ఐకమత్యంగా**

గ్రామంలో ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం స్పందించి అండగా నిలుస్తాం. ఎవరి ఇంట్లో వేడుక జరిగినా అందరం కలిసికట్టుగా జరుపుకుంటాం. గ్రామ అభివృద్ధికి సమష్టిగా నిర్ణయాలు తీసుకుంటాం. ఏళ్లుగా ఎటువంటి వివాదాలకు తావివ్వలేదు. ఇది మాకు గర్వకారణం. నూతన పంచాయతీ కావడంతో కొద్దిపాటి నిధులు మాత్రమే వచ్చాయి. వాటిని పొదుపుగా వాడుకుంటూ అందరి సహకారంతో అభివృద్ధికి పనులు చేపట్టాము. రమేష్, మాజీ సర్పంచి, ఆకుసాయిపల్లె

# తుది పని.. జాప్యం ఎందుకని?

సంగారెడ్డి : పేదల వైద్యానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది. సర్కారు దవాఖానాలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దాలని సంకల్పించింది. నూతన భవనాల నిర్మాణాలకు రూ.కోట్లలో నిధులు మంజూరు చేసింది. కొన్ని చోట్ల ఆయా నిర్మాణాలు తుది దశకు చేరుకున్నప్పటికీ.. కొద్దిపాటి పనులనూ పూర్తి చేయడం లేదు. గుత్తేదారులు అర్జీ పెట్టుకోవడం.. అధికారులు పనుల పూర్తికి గడువు పొడిగించడం సాధారణంగా మారింది.

**పటాన్‌చెరులో రూ.70 కోట్లతో..**

పటాన్‌చెరులోని ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో సూపర్ స్పెషాలిటీ దవాఖానా భవన నిర్మాణానికి గతేడాది రూ.70 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పరికరాల బిగింపునకు అదనంగా రూ.25 కోట్లు కేటాయించారు. పీసీబీ, ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన భవనాల పనులు చివరి దశకు చేరుకున్నాయి. రంగులు తదితర పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.5 కోట్ల బిల్లుల బకాయిలు ఉండటంతో పనులు నిలిచిపోయాయి. ఏప్రిల్ వరకు ఆసుపత్రి భవనాలను వినియోగంలోకి తీసుకొస్తామని అధికారులు చెబుతున్నారు.

**రంగులు వేసి.. తలుపులు బిగించాలి**

సంగారెడ్డికి మూడేళ్ల క్రితం ప్రభుత్వ వైద్య కళాశాల మంజూరయింది. ఇందులో భాగంగా జిల్లా ఆసుపత్రి ఆవరణలో ఏడాదిన్నర క్రితం రూ.23.75 కోట్లలో 'క్రిటికల్ కేర్ యూనిట్' భవనం పనులు ప్రారంభించారు. 95 శాతం పనులు పూర్తిచేశారు. కలరింగ్, విద్యుత్తు కనెక్షన్లు, తలుపుల బిగింపు తదితర తుది పనులు మాత్రమే మిగిలి ఉండగా.. గుత్తేదారు జాప్యం చేస్తున్నారు.



**జహీరాబాద్‌లో మాతాశిశు ఆరోగ్య కేంద్రం..**

జహీరాబాద్‌లోని మాతా శిశు ఆరోగ్య సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్) భవన నిర్మాణానికి ప్రభుత్వం గతేడాది రూ.7.5 కోట్ల నిధులు విడుదల చేసింది. రెండంతస్తుల పనులు పూర్తయ్యాయి. రంగులు, ఇతర తుది పనులు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.3 కోట్ల వరకు గుత్తేదారుకు బిల్లులు చెల్లించాల్సి ఉండటంతో నత్తనడకన పనులు సాగుతున్నాయి. ఏప్రిల్ చివరి నాటిని పనులన్నీ పూర్తి చేస్తామని అధికారులు వివరిస్తున్నారు.

**నర్సింగ్ విద్యార్థులకు 'అద్దె' కష్టాలు**

సంగారెడ్డి పట్టణం రామచంద్రారెడ్డి నగర్‌లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, విద్యార్థులకు వసతి గృహాల కోసం 2022లో రూ.34 కోట్లు మంజూరయ్యాయి. జీప్లస్-2 భవనం కోసం స్లాబ్ వేశారు. బిల్లుల సమస్యతో గుత్తేదారు పనులు నిలిపివేశారు. అద్దె భవనంలో నర్సింగ్ విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

వేగవంతం చేశాం..: రవీందర్‌రెడ్డి, ఈఈ, టీఎస్ఎంఎస్ఐడీసీ

జిల్లాలో ఆసుపత్రుల భవనాలు, నర్సింగ్ కళాశాల, వసతి గృహాల భవనాల పనులు గతంతో పోల్చితే వేగవంతమయ్యాయి. బిల్లుల చెల్లింపునకు ప్రాధాన్యం ఇస్తున్నాం. మార్చి, ఏప్రిల్ నాటికి భవనాలను వినియోగంలోకి తేవాలని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇటీవల లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆ దిశగా ముందుకు సాగుతున్నాం.

# ఆక్రమణలకు కోట

భువనగిరి : భువనగిరి కోట భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. నియంత్రించాల్సిన సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోకపోవడంతో కోట మూడు వైపులా నిర్మాణాల పరంపర కొనసాగుతోంది. ప్రస్తుతం కోట పురావస్తుశాఖ ఆధీనంలో ఉంది. ఈ శాఖ అధికారుల స్థానికంగా ఉండకపోవడంతో కోట ఆస్తులపై పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వే నంబర్ 212లోని సుమారు 45 ఎకరాల విస్తీర్ణంలో కోట ఆవరించి ఉంది. దీనికి చెంతనే ఉన్న అమ్మకుంట పరిసరాల్లో మూడెకరాలు, ప్రధాన రహదారి ముఖ్యకూడలి సమీపంలో అర ఎకరం ప్రభుత్వ భూమి ఉంది. కోట భూములకు సర్వే నిర్వహించి గత కొన్నేళ్ల క్రితం మార్కింగ్ చేశారు. కోట పరిధి నుంచి వంద మీటర్ల పరిధిలోని నిషేధిత జోన్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదు. గతంలో ఈ జోన్‌లో పూర్తయిన నిర్మాణాలకు పురావస్తుశాఖ అధికారులు సంబంధించిన వారికి నోటీసులు, మున్సిపల్ అధికారులకు, పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికి నేటికీ చర్యలు చేపట్టకపోవడంతో ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కోట కొత్తబస్టాండ్‌తో పాటు హైదరాబాద్-వరంగల్ జాతీయ రహదారి, పట్టణ ప్రధాన రహదారి వరకు ఆవరించి ఉంది. మరో వైపు అమ్మకుంట, పలు వెంచర్లు ఉన్నాయి. ఆయా ప్రాంతాల్లో భూమి ఖరీదుగా మారింది. దీంతో కోటకు ఆనుకుని సొంత భూములు ఉన్న వారు కోట వరకు నిర్మాణాలు చేపట్టారు. ఇటీవలి కోట పరిధిలోని కోట గడ్డను తవ్వి మట్టిని తరలించినప్పటికి ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై పురావస్తుశాఖ ఏడీ నాగలక్ష్మిని వివరణ కోరగా ఇప్పటికే పలువురికి నోటీసులు ఇచ్చామని, స్థానిక అధికారులకు ఫిర్యాదు చేశామని వివరణ ఇచ్చారు. ప్రస్తుత పరిస్థితిపై తమ ఉన్నతాధికారులకు నివేదికను సమర్పిస్తామని ఆమె తెలిపారు.

# క్రయ విక్రయాల తిప్పలు తప్పేదెన్నడో?

జగిత్యాల : జిల్లా కేంద్ర వ్యవసాయ మార్కెట్యార్డు అధిక ఆదాయం కలిగి ఏడాది పొడవునా క్రయవిక్రయాలు సాగిస్తున్నా.. పంట ఉత్పత్తుల విక్రయ అవకాశాల కల్పనలో వెనకంజలోనే ఉంది. బీటుబజార్‌లో పాత యార్డులోని మొత్తం 5.20 ఎకరాల స్థలంలో 2 ఎకరాల్లో గోదాములు, కార్యాలయం, రైతు విశ్రాంతి భవనం, ఏడీఏ కార్యాలయం, భూసార పరీక్షా కేంద్రం, ఈనామ్ భవనం తదితర నిర్మాణాలున్నాయి. మిగిలిన స్థలంలో దినుసుల క్రయవిక్రయాలు చేపట్టేవారు. ఇందులోనుంచి 2 ఎకరాల స్థలాన్ని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెటుకు ఇవ్వటంతో దినుసుల కళ్లానికి స్థలం ఇరుకుగా మారింది. మిగిలున్న కొంత స్థలంలోనే దినుసులను కొంటున్నా మార్కెట్ కార్యాలయాన్ని 4 కిలోమీటర్ల దూరంలోని చల్‌గల్ దినుసుల యార్డుకు తరలించటంతో అధికారులు ఓ చోట, క్రయవిక్రయాలు మరోచోటగా పరిస్థితి మారింది.

**అందని నిధులు** చల్‌గల్‌యార్డుకు బీటును పూర్తిగా తరలిద్దామన్నా అక్కడ పూర్తిస్థాయి క్రయవిక్రయాలు జరిపే పరిస్థితుల్లేవు. వాలంతరి ప్రదర్శన క్షేత్రం నుంచి గతంలో తీసుకున్న 21 ఎకరాల్లో 10 ఎకరాల స్థలాన్ని మామిడి మండీకి కేటాయించారు. దినుసుల బీటుకు ఇచ్చిన 16 ఎకరాల స్థలంలోనే 15 వేల టన్నుల సామర్థ్యంగల 4 భారీ గోదాములను, ఒక రైపెనింగ్ ఛాంబర్, కార్యాలయ భవనం, ధర్మకాంటా, 4 వేయింగ్‌షెడ్లు తదితర నిర్మాణాలు చేపట్టారు. మిగిలిన 5 ఎకరాల భూమిలోనూ సిమెంటు గచ్చు లేనందున కందులు, పెసలు, మక్కలు,



నువ్వులు తదితర దినుసులను కుప్పలుగా పోసి విక్రయించటం సాధ్యపడదు. వాలంతరి నుంచి మరో 10 ఎకరాలను తీసుకున్నా ఈ స్థలంకూడా మామిడి మండీకే కేటాయించటంతో దినుసుల బీటుకు 5 ఎకరాల స్థలమే మిగిలింది. ఏడాదిక్రితమే ఈ స్థలంలో రూ. కోటితో గచ్చు, రూ.70 లక్షలతో సిమెంటు రహదారులు, రూ.5 లక్షలతో వాలంతరి ప్రదర్శన క్షేత్రంవైపు ఫెన్సింగ్, రూ.10 లక్షలతో గోదాముల మరమ్మతులు తలపెట్టినా ఇప్పటికీ నిధులు మంజూరుగాక పనులను చేపట్టలేదు. చల్‌గల్‌యార్డు పట్టణానికి దూరంగా ఉండటంతో దినుసుల రక్షణ సమస్యగా మారింది. రైతులు, అడ్తీ ఖరీదుదారులు, మిల్లర్లు, చాట సడెం కూలీలు, దడువాయిలు, హమాలీలు చల్‌గల్‌కు వెళ్లి పొద్దంతా ఉండి క్రయవిక్రయాలు, తూకం చేపట్టాలంటే అనేక ఇబ్బందులుం టాయి. ఈ నేపథ్యంలో చల్‌గల్ యార్డులో రైతు విశ్రాంతి భవనంతో పాటుగా ఇతర భవనాలను నిర్మించాలి.

దినుసుల బీటును చల్‌గల్‌లో నిర్వహిస్తే ప్యాక్స్ ఆధ్వర్యంలోని చల్‌గల్ ధాన్యం సేకరణ కేంద్రానికి మరో స్థలాన్ని సమకూర్చాలి. దీనిపై మార్కెట్ కార్యదర్శి రాజశేఖర్ వివరిస్తూ నిధులు వస్తే అభివృద్ధి పనులను ప్రారంభిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిధులను విడుదల చేసి పనులను ప్రారంభిస్తే యాసంగి పంట ఉత్పత్తుల విక్రయ సమయానికి అందుబాటులోకి వస్తుంది.

# చరిత్ర ఘనం.. పరిస్థితి దయనీయం

హైదరాబాద్ : అద్భుతమైన కళా సంపద.. అపురూప శిల్పాలు.. అరుదైన ఈజిప్షియన్ మమ్మీ.. ప్రపంచంలోనే ఘనమైన నాణెలు.. ప్రసిద్ధ జైన, బౌద్ధ శిల్ప సంపద ఉన్న రాష్ట్ర పురావస్తు ప్రదర్శనశాల (స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం) నిరాదరణకు గురై సందర్శకులకు దూరమవుతోంది. 94ఏళ్ల చరిత్ర కలిగిన పబ్లిక్‌గార్డెన్‌లోని స్టేట్ మ్యూజియంలో అరుదైన కళా సంపద పెట్టెలు.. తాళాలు వేసిన గదులకే పరిమితమవుతోంది.

**ఎన్నో ప్రత్యేకతలు**

దాదాపు వందేళ్ల చరిత్ర కలిగిన వారసత్వ భవనంలోని స్టేట్ ఆర్కియాలజీ మ్యూజియం ప్రపంచంలోనే విక్టోరియా ఆల్బర్ట్ మ్యూజియం తర్వాత అత్యంత అరుదైన నాణెలు కలిగిన మ్యూజియంగా ప్రసిద్ధిగాంచింది. మన దేశంలో ఉన్న ఆరు ఈజిప్షియన్ మమ్మీల్లో ఒకటి ఇక్కడే ఉంది. అరుదైన మధ్య యుగపు నాటి అబ్దుల్ రహ్మాన్ సోగతాయి పెయింటింగ్స్ ఇక్కడే ఉన్నాయి. గద్వాల సంస్థాన కాలానికి చెందిన కూచిపూడి జడ సహా మధ్యయుగానికి సంబంధించిన అనేక నగలు ఉన్నాయి. శిలాయుగం నుంచి మధ్యయుగం దాకా జనజీవనంలో అన్ని అంశాలను స్పృశించే వస్తువులు ఉండటం విశేషం. కంచు విగ్రహాలు, బౌద్ధశిల్పాలు, బావికొండలో దొరికిన బుద్ధుని అస్తికలు.. కుతుబ్‌షాహీల కాలానికి సంబంధించిన వస్త్రధారణ, దక్కన్ మినియేచర్‌లు, అరుదైన శాసనాలు, మధ్యయుగంలో యుద్ధాల్లో ప్రత్యేక పాత్ర పోషించిన వివిధ రకరకాల ఫిరంగులు, అంతర్జాతీయ పరిశోధకులు ఆసక్తిగా పరిశోధించే జైన శిల్పాలు.. ఇలా తరగని అరుదైన వారసత్వ సంపద ఈ మ్యూజియం సొంతం. కానీ, సందర్శకుల సంఖ్య రోజు 30, 40 మంది కూడా ఉండకపోవడం ఆలోచించాల్సిన అంశం.

**25 శాతమే సిబ్బంది.. వసతులు లేవు**

స్టేట్ మ్యూజియంలో 80 మంది ఉద్యోగులకు 20 మందే ఉన్నారు. సిబ్బంది లేక కొన్ని గ్యాలరీలను మూసేశారు. సందర్శకులకూ కనీస వసతులు లేవు. తలుపులు లేని మరుగుదొడ్లు.. విరిగిన కుర్చీలు.. పగిలిన కిటికీలు.. అరకొర విద్యుత్ దీపాలతో దారుణమైన పరిస్థితుల్లో మ్యూజియం ఉంది. వేర్వేరు ప్రాంతాల నుంచి విద్యార్థులను తీసుకువస్తున్నారు. చివరకు ఇక్కడికి ఎందుకు వచ్చామా? అని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

**నామమాత్రంగానే ప్రదర్శన**

ఇక్కడ ఎన్నో ఉన్నా ప్రదర్శిస్తోంది నామమాత్రమే. మూడు నాలుగు గ్యాలరీలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం ఈజిప్షియన్ మమ్మీతోపాటు, డెకరేటివ్ ఆర్ట్ గ్యాలరీ, బుద్ధ గ్యాలరీ, ఇస్లామిక్ ఆర్ట్‌గ్యాలరీ, అజంతా చిత్రకళ గ్యాలరీ, అరబిక్, పర్షియన్ శాసనాలతో పాటు, ఆరుబయట ఉన్న ఫిరంగులు, కాకతీయ మండపం, చెక్కతో చేసిన రథంతోపాటు శిల్పాలు మాత్రం చూడగలుగుతున్నారు. వందేళ్లనాటి భవనం పలుచోట్ల దెబ్బతింది. బయటి కళారూపాలు వానకు తడిచి, ఎండకు ఎండుతున్నా పట్టించుకోవడం లేదు.

**తీవ్ర నిరాశకు గురయ్యాం:** ఉపాధ్యాయుడు, మహబూబ్‌నగర్ జిల్లా
40 మంది పిల్లల్ని విజ్ఞానయాత్రకు ఇక్కడికి తీసుకొచ్చాం. సగం కూడా ప్రదర్శించడం లేదు. ఏది చూసినా గేట్లు మూసి, తాళాలు వేసే ఉన్నాయి. ఉన్నవాటి వివరాలు సరిగ్గాలేవు. వివరించేవారు లేరు. పిల్లలు పది నిమిషాలు కూడా మ్యూజియంలో ఉండలేదు.

# మిరప రైతుకు ధరాఘాతం



ఖమ్మం : ఖమ్మం మిర్చి మార్కెట్‌లో గతేడాదితో పోల్చితే మిరప ధరలు సగానికి సగం పడిపోయాయి. గతేడాది సీజన్ ఆరంభంలో క్వింటా మిరప ధర గరిష్ఠంగా రూ.22వేలు పలకగా.. ఈసారి గరిష్ఠంగా రూ.14వేలు దక్కటమే గగనంగా మారింది. సీజన్ ఆరంభంలోనే ధరలు పడిపోతే.. కొత్త ఏడాదిలో అత్యధికంగా వచ్చే దిగుబడులను ఎలా అమ్ముకోవాలో తెలియటం లేదని రైతులు కుమిలిపోతున్నారు.

**దిగుబడుల్లో క్షీణత**

ఏటా పెరుగుతున్న పెట్టుబడులకు తోడు తెగుళ్ల దెబ్బతో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో మిరప సాగు విస్తీర్ణం క్రమేణా తగ్గుతోంది. గత సీజన్‌లో ఉభయ జిల్లాల్లో 1.50లక్షల ఎకరాల్లో పంట సాగవగా.. ఈసారి 95వేల ఎకరాలకే పరిమితమైంది. గతేడాది రైతులు ఆశించిన దానికన్నా ఎక్కువే మిరపకు ధర లభించింది. 2023 డిసెంబర్‌లో ఖమ్మం మార్కెట్‌కు కొత్త రకం మిర్చి రాక మొదలైంది. అప్పట్లో క్వింటా మిరప ధర రూ.22వేల వరకు పలకగా.. తాలు రకం మిరపకు రూ.11వేల వరకు దక్కింది. గతేడాది అనుభవంతో ఈసారి పంట సాగుచేసిన రైతులు ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు సరకు తీసుకొస్తున్నారు. శీతల గిడ్డంగుల్లో నిల్వ చేసిన మిరపనూ రైతులు, వ్యాపారులు విపణికి తెస్తున్నారు. అయితే ధరల పతనం రైతులను కుదేలు చేస్తోంది. ఈసారి మిరప ధర క్వింటాకు రూ.14వేలకు మించటం లేదు. తాలు రకం మిరపకు రూ.7వేలకు మించి పలకటం లేదు. ఈసారి దిగుబడులు క్షీణించటం రైతులకు శరాఘాతంగా మారింది. గతంలో ఎకరాకు 13 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా.. ఈసారి ఆరు క్వింటాళు దాటడమే గగనమవుతోంది.

**గిట్టుబాటు అయ్యేదెలా..?**

మిరప సాగుకు రైతులు ఎకరాకు రూ.1-1.50లక్షల పెట్టుబడి పెడుతున్నారు. కలుపు మందులు, కూలీల ఖర్చు విపరీతంగా పెరిగింది. మార్కెట్‌కు రవాణా చేసేందుకు రూ.3వేల వరకు ఖర్చవుతోంది. తీరా మార్కెట్‌కు తీసుకొస్తే నాణ్యత, తేమశాతం, మచ్చలు, తాలు సాకుతో వ్యాపారులు అమాంతం ధర తగ్గించేస్తున్నారు. ఈసారి పెట్టుబడులు కూడా పూడే పరిస్థితి లేదని రైతులు లబోదిబోమంటున్నారు. విపణికి ఇప్పుడిప్పుడే సరకు రాక మొదలైందని, జనవరి నుంచి ఎక్కువ మొత్తంలో వచ్చే అవకాశముందని చెబుతున్నారు. ధర మరింత పడిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మిరప ఎగుమతులు తగ్గిపోవటం వల్లే ధరలు పతనమవుతున్నాయని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

పది బస్తాల మిరపను ఖమ్మం మార్కెట్‌కు తీసుకొచ్చాను. మార్కెట్‌లో జెండా పాట రూ.16,700 నిర్ణయించారు. అయినా క్వింటా సరకును రూ.12-13వేలకే వ్యాపారులు కొంటున్నారు. తేమ, మచ్చ, తాలు సాకుతో ధర తగ్గిస్తున్నారు. గతేడాది ఇదే సమయానికి క్వింటా మిర్చి రూ.19,500కు విక్రయించాను. ఈసారి ఈ ధరతో రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. రూ.20 వేలు దాటితేనే పెట్టుబడులైనా పూడుతాయి.
ఉపేందర్, తొడియాళ్లగూడెం, డోర్నకల్ మండలం, మహబూబాబాద్ జిల్లా

ఎకరాకు రూ.లక్షకు పైగా పెట్టుబడి పెట్టాం. మిరప తీసేందుకు రూ.50వేల వరకు ఖర్చవుతోంది. ఈసారి దిగుబడి బాగా తగ్గింది. మార్కెట్‌కు వస్తే అసలు ధరలే లేవు. ఇక్కడి వ్యాపారులు అనేక సాకులు చూపి అమాంతం ధర తగ్గించి కొంటున్నారు. ఇలాగైతే మాకు అప్పులే మిగులుతాయి.
రామ్మూర్తి, కామేపల్లి, ఖమ్మం జిల్లా

# 'డైట్'కు నూతన సొబగులు




ఖమ్మం : ఖమ్మంలోని జిల్లా విద్యా, శిక్షణ(డైట్) కళాశాలకు మహర్దశ పట్టనుంది. రాష్ట్రంలోని రెండింటికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ హోదా లభించగా ఇందులో ఖమ్మంలోని డైట్ కళాశాల ఒకటి. రూ.8.62కోట్లతో అభివృద్ధి పనులను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించనున్నారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, కరీంనగర్, ఆదిలాబాద్, నల్గొండ జిల్లాల విద్యార్థులు ఇక్కడ ఉపాధ్యాయ వృత్తిలో శిక్షణ తీసుకుంటారు.

**రానున్న కొత్త కోర్సులు**

ప్రస్తుతం ఈ కళాశాలలో డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కోర్సును మాత్రమే నిర్వహిస్తుండగా ఇక నుంచి డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ కోర్సు రానుంది. దీని ఆధారంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, ఎల్‌కేజీ పిల్లలకు బోధించేందుకు అవసరమైన శిక్షణను టీచర్లకు ఇస్తారు. వీరితో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు బోధించే ఉపాధ్యాయులకూ తర్ఫీదు అందనుంది.

**1990-91లో ప్రారంభమై..**

జిల్లా స్థాయిలో విద్యా, శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహించేందుకు ఖమ్మం నగరంలోని టేకులపల్లిలో జిల్లా విద్యా, శిక్షణ సంస్థ (డైట్)ను 1990-91లో ఏర్పాటు చేశారు. అప్పట్లో తొలిసారిగా టీటీసీ కోర్సు ప్రవేశపెట్టారు. ఏడాది కోర్సులో 150 సీట్లు ఉండేవి. ఉపాధ్యాయ శిక్షణకు ప్రాధాన్యమిచ్చి నాణ్యమైన విద్యావ్యవస్థ స్థాపనకు ఈ సంస్థ దోహదపడింది. 1991లో కొత్త భవనాలు సమకూరాయి. ఇవి ఉపాధ్యాయులకు నైపుణ్యాభివృద్ధి, విద్యాశిక్షణ, పరిశోధనలు, ఆవిష్కరణలకు ఉపయోగపడుతున్నాయి. 2000 సంవత్సరంలో డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఈడీ) కోర్సు మొదలైంది. దీని వ్యవధి రెండేళ్లు. మొదటి సంవత్సరంలో 100 సీట్లు, రెండో సంవత్సరంలో 100 సీట్లతో భావి ఉపాధ్యాయులు శిక్షణ పొందుతున్నారు.

**డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్‌లో శిక్షణ..**

అనంతరం జరిగిన మార్పుల్లో 2014-15 విద్యాసంవత్సరంలో డీఈడీ కోర్సు డీఈఎల్ఎడ్(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్) కోర్సుగా మారింది. ఈ కోర్సులో మొదటి సంవత్సరంలో 100, రెండో సంవత్సరంలో 100 సీట్లున్నాయి. వీటిలో 50 సీట్లు ఆంగ్లమాధ్యమం, 50 సీట్లు తెలుగు మాధ్యమానికి కేటాయించారు. ఈ భవనాలు విద్యాశిక్షణలో వృత్తి పూర్వ, వృత్యంతర శిక్షణ కార్యక్రమాలను నిర్వహించే ముఖ్యకేంద్రంగా మారాయి.

సమకూరనున్న సౌకర్యాలు..

అదనపు తరగతి గదులు
ప్రహరీ
గ్రంథాలయ భవనం
కంప్యూటర్ రూమ్
సెమినార్ హాల్, ప్రయోగశాలలు
స్పెషల్ ఎడ్యుకేషన్ యూనిట్
రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సెంటర్
శౌచాలయాలురీ క్యాంటీన్ ఏర్పాటు
తాగునీటి వసతి
పార్కింగ్ సౌకర్యం
పాత భవనాలకు మరమ్మతులు

# విశ్వవేదిక.. బృహత్తర ప్రణాళిక

హైదరాబాద్: మహానగరానికి కొత్త బృహత్తర ప్రణాళిక సిద్ధమవుతోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్ఎండీఏ) దీనిపై కొంతకాలంగా కసరత్తు చేస్తోంది. అంతర్జాతీయ కన్సల్టెంట్ల ఆధ్వర్యంలో కొత్త మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన చేస్తున్నారు. కొత్త ఏడాదిలో సెప్టెంబరు, అక్టోబరు నాటికి దీనికి సంబంధించి ముసాయిదాను విడుదల చేయనున్నట్లు తాజాగా అధికార వర్గాలు తెలిపాయి. అనంతరం ప్రజలకు అవగాహన కల్పించి..అభ్యంతరాలను స్వీకరించనున్నారు. **ఐదింటి స్థానంలో.. ఒక్కటే** ప్రస్తుతం మహానగర పరిధిలో 5 మాస్టర్‌ప్లాన్‌లు అందుబాటులో ఉన్నాయి. దీనివల్ల పలు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఏదైనా భారీ ప్రాజెక్టును చేపట్టే సందర్భంలో ఒకటి కంటే ఎక్కువ సంస్థల నుంచి అనుమతులు తీసుకోవాల్సి వస్తోంది. ఇక నుంచి ఆ ఇబ్బంది లేకుండా ఒక్కటే మాస్టర్‌ప్లాన్ అందుబాటులోకి తెచ్చేందుకు కొన్నాళ్లుగా కసరత్తు చేస్తున్నారు. నగరంలో వేగంగా పెరుగుతున్న జనాభాకు తగ్గట్లు వసతులు కల్పించడం తలకు మించిన భారమే. తాగునీరు, మురుగు వ్యవస్థ, ప్రజారవాణా, పచ్చదనం, చెరువులను కాపాడుకోవడం అత్యవసరం. తాజా ప్రణాళికలో ఈ అంశాలన్నింటికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్ మధ్య రేడియల్ రోడ్లు, గ్రిడ్ రోడ్లు, మెట్రో సేవల విస్తరణకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రజారవాణాను పటిష్ఠం చేసేందుకు మొబిలిటీ ప్లాన్‌లో సూచనలు చేయనున్నారు. అభివృద్ధి మాటున ఈ నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా బ్లూ అండ్ గ్రీన్ పేరుతో ప్రత్యేక ప్రణాళిక రూపుదిద్దుకుంటోంది. పచ్చదనానికి పెద్దపీట వేసేందుకు తగిన అంశాలు ఇందులో పొందుపర్చనున్నారు. కొత్త ప్రణాళికలో మరో మూడు ప్రత్యేక ప్రణాళికలకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. అంతర్గతంగా మొబిలిటీ, ఎకానమీ, బ్లూఅండ్ గ్రీన్ ప్లాన్‌లు ఇందులో మిళితం కానున్నాయి. మొబిలిటీ ప్లాన్ కింద ఆర్ఆర్ఆర్ వరకు రవాణా సేవలకు అధిక ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ప్రస్తుతమున్న హైదరాబాద్ మాస్టర్‌ప్లాన్-2031లో ఏడు జిల్లాల పరిధి మాత్రమే ఉంది. ప్రాంతీయ రింగు రోడ్డు(ఆర్ఆర్ఆర్) వరకు విస్తరించనున్నారు.

# పొలాల్లోకి మురుగు.. పంట కనుమరుగు

పెద్దేముల్: పంట కాలం నాలుగు నెలలు పూర్తి అయ్యింది. రాత్రి, పగలు కష్టించి పండించిన పంట కోతకొచ్చింది. కానీ సాగు చేసిన పంటను కోయలేని పరిస్థితిని ఆ రైతులు ఎదుర్కొంటున్నారు. దీనికి కారణం.. గ్రామంలోని మురుగు నీరంతా పొలాల్లోకి చేరి పంట దెబ్బతినడం. మండల కేంద్రం పెద్దేముల్‌లోని పోచమ్మ గుడి పరసర ప్రాంతంలో ఈ పరిస్థితి నెలకొంది. దీనికి సంబంధించి కథనం.

**బాధిత రైతులు 15 నుంచి 25 మంది**

పెద్దేముల్ మండలంలో దాదాపు 20 ఎకరాల్లో 15 నుంచి 25 మంది రైతులు ఖరీఫ్ కింద వరి పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట కోతలు మొదలు పెట్టాలి. అయితే గ్రామంలోని మురుగు నీరంతా వరి పొలాల్లోకి వచ్చి చేరుతోంది. రోజుల తరబడి నీరు పొలాల్లో నిల్వ ఉంటోంది. పొలాలు బురదగా మారి కోతలు కోయలేని విధంగా తయారైంది. పంట కాలం పూర్తి కావడంతో నిలువునా ఎండుతోంది. గింజలు రోజు రోజుకు రాలిపోతున్నాయి. బురదలో కూలీలు పని చేయడానికి వెనకంజ వేస్తున్నారు. యంత్రాలతో కోయించాలని చూసినా బురదలో ఇరుక్కుపోతామని వారు రావడంలేదు.



**ప్రత్యామ్నాయ మార్గం చూపక పోవడమే సమస్య**

గ్రామంలోని ఎస్సీ కాలనీలో ప్రజలు తమ అవసరాలకు వినియోగించిన నీరు మురుగు కాల్వల ద్వారా బయటికి పోతోంది. గ్రామ పంచాయతీ వారు మురుగు ముందుకు వెళ్లేందుకు పెద్ద కాల్వను కాలనీ వరకు నిర్మించి వదిలేశారు. అక్కడి నుంచి వ్యవసాయ పొలాలు ఉన్నాయి. ఎగువ ప్రాంతంలో అవసరాలకు వినియోగించిన మురుగు నీరు నేరుగా పొలాల్లోకి చేరుతోంది. దీంతో వానాకాలం పొలాలు నీటితో నిండి చిన్నపాటి చెరువులను తలపిస్తున్నాయి.

**అవస్థలు పడలేక బీడుగా వదిలేశారు** పంట సాగు చేసినా లాభం లేదని కొందరు రైతులు పొలాలను బీడుగా వదిలేశారు. నీరు ముందుకు పోయే దారి చూపితేనే రైతుల కష్టాలు దూరమవుతాయి. జేసీబీ సాయంతో కాలువ తీసి మురుగు నీరు ముందుకు సాగే విధంగా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎండాకాలం వరకు పొలాలు నీటితోనే ఉంటాయని రైతు ఎర్ర బాలప్ప వాపోయారు. అధికారులు తక్షణమే పంటలు దెబ్బతినకుండా, మురుగు వెళ్లేందుకు వేరే మార్గం చూడాలన్నారు.

# అప్రమత్తతే ఆయుధం..

బషీరాబాద్ : సాంకేతికత ప్రజలకు చేరువయ్యే కొద్దీ 'సైబర్ నేరాలు' పెరిగిపోతున్నాయి. చేతికి ఏమాత్రం మట్టి అంటకుండా బ్యాంకు ఖాతాలు, ఫోన్లనుంచి రూ.వేలు, రూ.లక్షలు కాజేస్తున్నారు. ఇలాంటి ఘటనలు జిల్లాలో తరచూ సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఇప్పటివరకు ఎంత మేర జరిగాయి, దీని బారిన పడకుండా ఏంచేయాలి వంటి అంశాలతో 'న్యూస్‌టుడే' కథనం.

**అవగాహనకు 2023లో వారియర్ల ఏర్పాటు**

సైబర్ నేరాల తీరుపై పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించడానికి 2023లో జిల్లాలో పోలీస్‌స్టేషన్‌కు ఒకరి చొప్పున 19 పోలీస్‌స్టేషన్లకు 19 మంది స్టేషన్ రైటర్లను వారియర్లుగా నియమించారు. వీరికి ఇదివరకే సైబర్ మోసాలను పసిగట్టడంలో, ఆన్‌లైన్ ద్వారా మోసగాళు ఎలా మోసం చేస్తారో వాటిని ఎలా ఎదుర్కోవాలో నిపుణులతో శిక్షణ ఇచ్చారు. దీన్లో నేర్చుకున్న అంశాలనే సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు.

**వెంటనే చెబితే మంచిది**

సైబర్ మోసానికి గురైనట్టు గుర్తించగానే వెంటనే ఫోన్ చేసి వివరాలు చెబితే మంచిది. అధికారులు తక్షణం స్పందించి ఆ నగదు ఇతర ఖాతాల్లోకి జమ కాకుండా నిలిపి వేస్తారు. ప్రశాంత్‌రెడ్డి, డీఎస్పీ, సైబర్ నేరాల నియంత్రణ, వికారాబాద్.




**ఇవి గుర్తుంచుకోండి**

ఏ బ్యాంకు వారూ ఫోన్‌చేసి అకౌంట్ వివరాలు, పిన్ నంబర్ అడగరు.
మీ అకౌంట్ అప్‌డేట్ చేయాలని అడిగితే మోసపూరితమని గుర్తించాలి.
తెలియని లింక్‌లను ఓపెన్ చేయకూడదు.
బ్యాంకులు, ఆడిట్, ఆదాయ పన్ను, పోలీస్ అధికారుల పేరుతో ఎవరైనా ఫోన్ చేసి బెదిరిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి.
డెబిట్, కార్డు, క్రెడిట్ కార్డుల వాడకంలో జాగ్రత్త వహించాలి.

గత డిసెంబరులో తాండూరుకు చెందిన ఓ ఉద్యోగికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అధిక వడ్డీ ఆశచూపి రూ.14 లక్షలు కాజేశారు. చివరకు తాను మోసపోయానని గ్రహించి తాండూర్ పోలీసులను ఆశ్రయించారు. కేసును వికారాబాద్ సైబర్ ఠాణాకు బదిలీ చేశారు. కేసు పరిశోధించి సైబర్ నేరగాళ్ల ఖాతాలో ఉన్న రూ.4 లక్షలను స్తంభింపజేశారు.

పరిగి పట్టణానికి చెందిన ఓ వ్యాపారికి అపరిచిత అమ్మాయి ఫోన్ చేసి మాటల్లోఇ దించి అతడి నగ్న వీడియో తీసింది. దాన్ని చూపి బెదిరించడంతో రూ.60 వేలకు పైగా సమర్పించుకున్నాడు. పోలీసులను ఆశ్రయించడంతో వేధింపులు ఆగిపోయాయి.

సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నం. 1930
గత ఏడాది కంటే పెరిగిన సైబర్ కేసులు
బాధితులు నష్టపోయింది: రూ.3.1 కోట్లు
స్వాధీనం చేసుకుంది: రూ.80 లక్షలు
నిలిపివేసిన మొత్తం: రూ.60 లక్షలు




ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదోసారి కేంద్ర బడ్జెట్‌ను సమర్పించారు. ఆమె ఫిబ్రవరి 1, 2025, శనివారం ఉదయం 11 గంటలకు పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించారు. ఇది మోడీ 3.0 పాలనలో మొదటి పూర్తి స్థాయి బడ్జెట్ అవుతుంది. బడ్జెట్ రోజుకు కొన్ని రోజుల ముం దు, ప్రభుత్వం ఆదాయపు పన్ను చట్టం తెస్తుందని ప్రకటించారు. కొత్త ఆదాయపు పన్ను బిల్లును వచ్చే వారంలో పార్లమెంటుకు సమర్పించనున్నట్లు ఆమె ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ లో కొత్త పన్ను విధానం ప్రకారం, వార్షిక ఆదాయం రూ. 12 లక్షల వరకు ఉన్నవారు ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. దీని కారణంగా, సాలీనా రూ.25 లక్షల ఆదాయం ఉన్నవారికి రూ.1 లక్ష ప్రయోజనం చేకూరుతుంది.

దీంతో పాటు, టీడీఎస్, టీసీఎస్ లను రూ.7 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. అలాగే TDS ప్రక్రియ సరళం చేసేందుకు కూడా చర్యలు తీసుకున్నారు. అలాగే టీడీఎస్ నేర రహితం చేయబడుతుంది. టీడీఎస్ పరిమితి రూ.2.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు ఉంటుంది.

**ఇన్ కం టాక్స్ శ్లాబులపై కీలక పాయింట్లు ఇవే:** రూ. 12 లక్షల సాలీనా ఆదాయం వరకూ ఎలాంటి పన్నులు చెల్లించాల్సిన అవసరం లేదు..స్టాండర్డ్ డిడక్షన్‌తో కలిపితే రూ.12.75 లక్షల వరకు సున్నా పన్ను.

**కొత్త టాక్స్ శ్లాబులు ఇవే:** రూ. 0-4 లక్షల నిల్, రూ. 4 లక్షలు-రూ. 8 లక్షలు: 5%, రూ. 8 లక్షలు-రూ. 12 లక్షలు: 10%, రూ. 12 లక్షలు-16 లక్షలు: 15%, రూ. 16 లక్షలు-20 లక్షలు: 20%, రూ. 20 లక్షలు-24 లక్షలు: 25%, రూ. 24 లక్షల పైన: 30%.

**పాత పన్ను శ్లాబులో మార్పు లేదు:** ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పాత పన్ను శ్లాబ్‌లో ఎలాంటి మార్పులు చేయలేదు. పాత పన్ను శ్లాబ్‌లో గతంలో లాగా రూ.5 లక్షల వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు. 50 వేల స్టాండర్డ్ డిడక్షన్ కూడా ఉంది.

**పాత పన్ను విధానం పన్ను స్లాబ్ :** - రూ. 0 నుండి రూ. 2.5 లక్షల వరకు: 0%, - రూ. 2.5 లక్షల నుండి రూ. 5 లక్షల వరకు: 5%, - రూ. 05 లక్షల నుండి రూ. 10 లక్షల వరకు: 20%, - రూ. 10 లక్షల కంటే ఎక్కువ ఆదాయం: 30%. రూ. 12 లక్షల వరకు వార్షిక ఆదాయంపై ఎలాంటి పన్ను ఉండదని బడ్జెట్ సందర్భంగా ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. అలాగే స్టాండర్డ్ డిడక్షన్ రూ.75000గా నిర్ణయించారు. ఈ నేపథ్యంలో రూ. 12,75,000పై ఎటువంటి పన్ను చెల్లించాల్సిన అవసరం ఉండదు. అంటే వార్షిక ఆదాయం రూ.12 లక్షల 75 వేలు ఉన్న వారు ఒక్క రూపాయి కూడా పన్ను చెల్లించాల్సిన అవసరం లేదు.



## ఏపీలో వేగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ.. 11 గంటలకే 77.66 శాతం పూర్తి..

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ కార్యక్రమాన్ని వేగంగా అమలు చేస్తోంది. ఈ రోజు తెల్లవారుజామున నుంచే సచివాలయ సిబ్బంది పింఛన్ల పంపిణీని ప్రారంభించారు. వారికి ఇచ్చిన ఆదేశాల మేరకు, లబ్ధిదారుల ఇంటికి వెళ్లి నేరుగా పింఛన్లు పంపిణీ చేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో రాష్ట్రంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుంది. ఉదయం 11 గంటల సమయానికి, మొత్తం 77.66 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశారు. ఈ క్రమంలో ఇప్పటివరకు 49.38 లక్షల మందికి రూ. 2,102 కోట్ల విలువైన పింఛన్లు అందించామని అధికారులు తెలిపారు.

**లబ్ధిదారుల సంతోషం..** ఈ క్రమంలో పింఛను లబ్ధిదారులకు ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలపై అవగాహన పెంచడం, చేపడుతున్న కార్యక్రమాలను సమర్థంగా అందించడమే లక్ష్యంగా కొనసాగుతోంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల పింఛన్లు నేరుగా లబ్ధిదారుల ఇంటికి పంపిణీ చేస్తున్నారు. దీని ద్వారా ముఖ్యంగా అంగవైకల్యులు, వృద్ధులు, నిరుపేదలు సహా అనేక వర్గాలకు న్యాయం జరుగుతోంది. దీనివల్ల పింఛన్లు త్వరగా లబ్ధిదారులకు వస్తుండటంతో వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వ లక్ష్యం..** ఇప్పటికే వివిధ జిల్లాల్లో సచివాలయ సిబ్బంది పింఛన్లు పంపిణీ చేయడంలో మొత్తం సమయం, కృషిని పెంచారు. ప్రతి సిబ్బంది, వేగంగా, సజావుగా ఈ పంపిణీ చేసేందుకు జాగ్రత్తగా పనిచేస్తున్నారు. ఈ పింఛను పంపిణీ కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి వ్యక్తికి ప్రభుత్వ భరోసా అందుతుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. లబ్ధిదారులు ఈ పింఛను పంపిణీ విధానాన్ని అత్యంత సానుకూలంగా స్వీకరిస్తున్నారు. మా ఇంటికి నేరుగా వచ్చి పింఛను అందించడం ఎంతో సంతోషంగా ఉందని చెబుతున్నారు. దీనివల్ల వయోవృద్ధులకు పెద్దగా కష్టపడాల్సిన అవసరం లేదని రాములు అనే పింఛను లబ్ధిదారు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వానిది ఒక కీలకమైన అడుగు అని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రధాని మోదీ వికసిత్ భారత్ దార్శనికతను బడ్జెట్ ప్రతిబింబిస్తోంది: సీఎం చంద్రబాబు

అమరావతి: కేంద్ర బడ్జెట్ 2025ను ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అయిన మధ్యతరగతి ప్రజలకు పన్ను మినహాయింపు గొప్ప పరిణామమని తెలిపారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ దార్శనికతను బడ్జెట్ ప్రతిబింబిస్తోందన్నారు. ప్రజా అనుకూల ప్రగతిశీల బడ్జెట్‌ను ఇవాళ నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టారన్నారు.

మహిళలు, పేదలు, యువత, రైతుల సంక్షేమానికి ప్రాధాన్యతనిచ్చారన్న సీఎం.. రాబోయే ఐదేళ్లలో వృద్ధికి ఆరు కీలక రంగాలను బడ్జెట్ గుర్తించిందన్నారు. జాతీయ శ్రేయస్సు దిశగా ఈ బడ్జెట్ కీలక అడుగులు సూచిస్తోందని తెలిపారు. దేశానికి సుసంపన్నమైన భవిష్యత్తును వాగ్దానం చేస్తూ సమగ్రమైన బ్లూప్రింట్‌గా




పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు.

## ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా ఏబీ వెంకటేశ్వరరావు

అమరావతి: ఏపీ పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా విశ్రాంత ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావు (ఏబీవీ) నియమితులయ్యారు. రెండేళ్ల పాటు ఆయన ఈ పదవిలో కొనసాగుతారని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. గతంలో జగన్ ప్రభుత్వం రెండు సార్లు ఆయనపై సస్పెన్షన్ వేటు వేసింది. మొదటి దఫా 2020 ఫిబ్రవరి నుంచి 2022 ఫిబ్రవరి 7 వరకు.. రెండోసారి 2022 జూన్ 28 నుంచి 2024 మే 30 వరకు సస్పెన్షన్ విధించింది. ఆ కాలాన్ని విధులు నిర్వహించినట్లుగా క్రమబద్ధీకరిస్తూ ఇటీవల ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సస్పెన్షన్ కాలంలో ఏబీవీకి ఇవ్వాల్సిన మొత్తం వేతనం, అలవెన్సులు చెల్లించాలని స్పష్టం చేసింది. సస్పెన్షన్ వేటు పడకపోతే ఎంతమొత్తం ఇవ్వాలో ఆ మేరకు చెల్లించాలని ఆదేశించింది. ఏబీవీపై నమోదు చేసిన అభియోగాలను ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్న విషయం తెలిసిందే.

## రూ.12లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు.. చరిత్రాత్మక నిర్ణయం: రామ్మోహన్‌నాయుడు



దిల్లీ: బడ్జెట్‌లో రూ.12 లక్షల వరకు ఆదాయపన్ను మినహాయింపు ఇవ్వడం చరిత్రాత్మకమని కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు అన్నారు. ఈ తరహా నిర్ణయం గతంలో ఎప్పుడూ తీసుకోలేదని చెప్పారు. దీంతో మధ్యతరగతికి మరింత ప్రయోజనం కలుగుతుందన్నారు. ఈ నిర్ణయం పార్టీలకు అతీతంగా ప్రతి ఒక్కరూ హర్షించాల్సిన విషయమన్నారు. బడ్జెట్‌పై ఏపీకి చెందిన కూటమి ఎంపీలు నిర్వహించిన మీడియా సమావేశంలో రామ్మోహన్‌నాయుడు మాట్లాడారు. 'దేశమంటే మట్టికాదోయ్.. దేశమంటే మనుషులోయ్'.. గురజాడ అప్పారావు మాటలను గుర్తుచేస్తూ ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్ ప్రసంగాన్ని ప్రారంభించడం తెలుగువారందరికీ గర్వకారణమని రామ్మోహన్‌నాయుడు అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పలు దఫాలుగా కేంద్రంతో సీఎం చంద్రబాబు సంప్రదింపులు జరిపారన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద చేపట్టే పనుల గడువు ముగుస్తున్నందున వాటిని పొడిగించాలని చంద్రబాబు విజ్ఞప్తి చేశారని, బడ్జెట్‌లో ఆ మేరకు నిర్మలా సీతారామన్ పేర్కొన్నారని తెలిపారు. జల్‌జీవన్ మిషన్ పనులను 2028 వరకు పొడిగించారన్నారు. దీని వల్ల రాష్ట్రంలో ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా తాగు నీరు అందించేందుకు ఉపయోగపడుతుందని చెప్పారు. గత ప్రభుత్వం రూ.15వేల కోట్ల జల్‌జీవన్ మిషన్ నిధులను వినియోగించుకోలేదని రామ్మోహన్ విమర్శించారు. ఎంఎస్ఎంఈలకు బడ్జెట్‌లో ప్రాధాన్యం కల్పించారని.. దీని ద్వారా ఏపీకి ప్రయోజనాలు దక్కనున్నాయని తెలిపారు. ఉడాన్ పథకాన్ని మరో 10 ఏళ్లు పొడిగించడంపై నిర్మలా సీతారామన్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. మీడియా సమావేశంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, తెదేపా పార్లమెంటరీ పార్టీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు పాల్గొన్నారు.




కేంద్రంలో ఎన్డీయే కూటమిలో మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ పూర్తిస్థాయి తొలి బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఈసందర్భంగా బిహార్‌పై వరాల జల్లు కురిపించారు. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలకు వెళ్లనున్న ఆ రాష్ట్రానికి వార్షిక పద్దులో ప్రత్యేక స్థానం దక్కింది. బిహార్‌లో మఖానా బోర్డు ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి తెలిపారు. మఖానా వ్యాపారం కోసం రైతుల సౌకర్యార్థం ఈ బోర్డు పని చేయనుంది. "బిహార్‌లో ఏర్పాటుచేయనున్న మఖానా బోర్డు ద్వారా వాటి ఉత్పత్తి, ప్రాసెసింగ్, మార్కెటింగ్ అవకాశాలు మెరుగుపడనున్నాయి. దీనికింద రైతులకు శిక్షణ అందుతుంది. వారు అన్ని ప్రభుత్వ పథకాల నుంచి ప్రయోజనం పొందేలా బోర్డ్ చూస్తుంది" అని మంత్రి వెల్లడించారు. బిహార్‌లోని మిథిలాంచల్ ప్రాంతంలో 50,000 హెక్టార్లకు ప్రయోజనం చేకూర్చే వెస్టర్న్ కోసి కెనాల్‌కు ఆర్థికసాయం అందిస్తాం. ఐఐటీ పట్నా సామర్థ్యాన్ని మరింత పెంచుతాం. పదేళ్లలో 4 కోట్ల మందికి విమాన ప్రయాణం కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్న కేంద్రం ఆ దిశగా బిహార్‌లో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుకు నిర్ణయం తీసుకుంది. బిహార్‌లో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అండ్ మేనేజ్‌మెంట్ ఏర్పాటుచేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. దీనిద్వారా ఫుడ్ ప్రాసెసింగ్ కార్యకలాపాలకు మరింత మద్దతు అందనుంది. బిహార్‌లో ఈ ఏడాది చివర్లో ఎన్నికలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ రాష్ట్రంలో ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్ పార్టీ జేడీయూతో కలిసి భాజపా అధికారంలో ఉంది.

ఆ జేడీయూ కేంద్రంలోని ఎన్డీయేలో కీలక భాగస్వామి. బిహార్‌కు ప్రత్యేక హోదా సాధ్యం కాదని తేల్చిచెప్పిన కేంద్రం.. ఎన్నికల ముందు ఇలా వరాల జల్లు కురిపించింది. గత ఏడాది సార్వత్రిక ఎన్నికల తర్వాత జులైలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కూడా రహదారుల అభివృద్ధి, గంగానది రెండు లైన్ల వంతెన నిర్మాణం, విద్యుదుత్పత్తి కేంద్రం వంటి పలు ఆర్థిక వరాలు ఇచ్చింది.

## బడ్జెట్ 2025: తగ్గేవి.. పెరిగేవి ఇలా..

దేశ ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తయారీ రంగాన్ని ప్రోత్సహించే దిశగా కేంద్ర బడ్జెట్‌లో పలు ప్రకటనలు చేశారు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్. సమ్మిళిత అభివృద్ధి, పరిశ్రమలకు మద్దతు ఇచ్చేలా కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కొన్ని వస్తువులపై సుంకాలను తగ్గించారు. దీంతో ఎలక్ట్రానిక్స్, కీలక ఔషధాల ధరలు తగ్గనున్నాయి. మరికొన్ని వస్తువులపై మాత్రం కస్టమ్స్ డ్యూటీని పెంచారు. మరి ఈ బడ్జెట్ తర్వాత దేశంలో ఏయే వస్తువుల ధరలు తగ్గనున్నాయి..? వేటి ధరలు పెరగనున్నాయి అంటే..

**తగ్గేవి ఇవి..** క్యాన్సర్, దీర్ఘకాల వ్యాధులను నయం చేసే 36 రకాల ఔషధాలను బేసిక్ కస్టమ్స్ డ్యూటీ నుంచి పూర్తిగా మినహాయించారు. దీంతో ఈ మందుల ధరలు దిగి రానున్నాయి. ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల్లో ఉపయోగించే ఓపెన్ సెల్స్, ఇతర పరికరాల బేసిక్ కస్టమ్ సుంకాన్ని 5 శాతానికి తగ్గించారు. కోబాల్ట్ పౌడర్, లిథియం అయాన్ బ్యాటరీ తుక్కు, లెడ్, జింక్ సహా 12 రకాల క్రిటికల్ మినరల్స్‌ను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించారు.

ఈవీ బ్యాటరీ తయారీలో ఉపయోగించే 35 రకాల ముడి పదార్థాలు, మొబైల్ ఫోన్ తయారీ బ్యాటరీలో వినియోగించే 28 అదనపు పరికరాలను పన్ను మినహాయింపు వస్తువుల జాబితాలో చేర్చారు. దీంతో ఈవీలు, మొబైల్స్ ధరలు దిగి రానున్నాయి.

వెట్ బ్లూ లెదర్‌ను కస్టమ్స్ సుంకం నుంచి మినహాయించారు. దీంతో




లెదర్ బూట్లు, బెల్ట్‌లు, జాకెట్ల ధరలు తగ్గనున్నాయి. శీతలీకరించిన చేపల ముక్కలపై కస్టమ్స్ సుంకాన్ని 30 శాతం నుంచి 5 శాతానికి తగ్గించారు. నిర్మాణరంగంలో ఉపయోగించే పాలరాయి, ట్రావర్టిన్ వంటి వాటిపై కస్టమ్స్ సుంకాన్ని 40శాతం నుంచి 20 శాతానికి తగ్గించారు. ముడి గ్రానైట్ లేదా ముక్కలుగా చేసిన గ్రానైట్‌పై సుంకాన్ని 40శాతం నుంచి 20 శాతానికి కుదించారు. ఆహార పదార్థాలు, శీతల పానీయాల ఉత్పత్తిలో వినియోగించే సింథటిక్ ఫ్లేవరింగ్ పదార్థాలపై సుంకాన్ని 100 శాతం నుంచి 20శాతానికి తగ్గించారు.

**పెరిగేవి ఇవే..** ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ డిస్‌ప్లేపై సుంకాన్ని 10శాతం నుంచి 20శాతానికి పెంచారు. దీంతో టీవీల ధరలు పెరిగే అవకాశం ఉంది. దేశీయ టెక్స్‌టైల్ ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు.. అల్లికల దుస్తులపై కస్టమ్స్ సుంకాన్ని 10శాతం నుంచి 20శాతానికి పెంచారు.

## వారిపై పోస్టులు పెట్టారో జాగ్రత్త.. వైసీపీకి అనిత హెచ్చరిక



అమరావతి, ఫిబ్రవరి 1: వైసీపీ నేతలు మహిళలు అనే సంగతి మర్చిపోయి బాధిత మహిళ కుటుంబాన్ని అవమానపరుస్తున్నారని హోంమంత్రి వంగలపూడి అనిత ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. నిన్న (శుక్రవారం) శ్రీకాకుళం జిల్లాలో బాలికను ఒక వ్యక్తి కొడితే గ్యాంగ్ రేప్ అని వైసీపీ నేతలు అబద్ధపు ప్రచారం చేశారన్నారు. నిన్న శ్రీకాకుళం జిల్లాలో బాలిక ఇష్యూకు సంబంధించి నిందితుడిని 24 గంటల్లో పట్టుకున్నామన్నారు. మాజీ మంత్రి ధర్మాన , మరికొందరు వైసీపీ నేతలు బాలిక ఇంటికి వెళ్లి రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. బాధిత కుటుంబం అత్యాచారం జరగలేదని ఫిర్యాదు ఇచ్చినా కావాలనే వైసీపీ నేతలు నీచ రాజకీయం చేస్తున్నారన్నారు. ఎవరైనా సరే నిందితులను 24 గంటల్లో పట్టుకుంటున్నామన్నారు. మహిళలతో గంట, అరగంట అన్నవారు వైసీపీలో మంత్రులు అయ్యారని వ్యాఖ్యలు చేశారు. వైసీపీ నేతలు సోషల్ మీడియాలో మహిళలపై తప్పుడు పోస్టులు పెడితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రభుత్వం మీద బురదజల్లే క్రమంలో వైసీపీ నేతలు ఆడపిల్లల జీవితాలతో ఆడుకుంటున్నారన్నారు. నిజం తెలుసుకోకుండా ట్విట్టర్, సోషల్ మీడియాలో మహిళలపై పోస్టులు పెడితే వెంటనే అరెస్టులు ఉంటాయని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరికలు చేశారు. కాగా.. శ్రీకాకుళంలో బీఎస్సీ విద్యార్థినిపై దాడి తీవ్ర కలకలం రేపిన విషయం తెలిసిందే. విజయనగరం జిల్లాకు చెందిన యువతి శ్రీకాకుళం ప్రభుత్వ బీసీ వసతి గృహంలో ఉంటున్న విద్యార్థినిపై కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఇంటర్న్‌షిప్ చేస్తున్న యువతి కళాశాలకు వెళ్లకుండా హాస్టల్‌లోనే ఉంటోంది. ఈ క్రమంలో నిన్న పుస్తకాల కోసం బయటకు వెళ్లిన విద్యార్థిని రాత్రి సమయంలో హాస్టల్ సమీపంలోని అపస్మారకస్థితిలో పడి ఉండటాన్ని తోటి విద్యార్థినులు గుర్తించి హాస్టల్ వార్డెన్‌కు సమాచారం ఇచ్చారు. విద్యార్థిని శరీరంపై గాయాలు ఉండటంతో వెంటనే ఆస్పత్రికి తరలించారు. అయితే విద్యార్థినిపై అత్యాచారం జరిగినట్లు ఆధారాలు ఏమీ లేవని ఆస్పత్రి సూపరింటెండెంట్ తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. అలాగే విద్యార్థినిపై దాడికి సంబంధించి మంత్రులు అనిత, అచ్చెన్నాయుడు ఆరా తీశారు. బాధ్యతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, ఎస్పీని ఆదేశించారు.




జె.పంగులూరు: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఒకటో తేదీన లబ్ధిదారులకు ఇళ్ల వద్దకే వెళ్లి పింఛను అందజేస్తున్నామని ఏపీ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బాపట్ల జిల్లా జె.పంగులూరు మండలం ముప్పవరంలోని ఎస్సీ కాలనీలో లబ్ధిదారులకు ఆయన పింఛన్లు పంపిణీ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ ముందుకెళ్తున్నామని చెప్పారు. ప్రతి గ్రామంలో సీసీరోడ్లు, పాఠశాలల అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు.

## సెగలు పుట్టించేలా బ్లాక్ డ్రెస్‌లో అషు పాప

సోషల్ మీడియా గ్లామర్ భామగా పేరు తెచ్చుకున్న అషు రెడ్డి మరోసారి తన అందచందాలతో అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఆమె షేర్ చేసిన బ్లాక్ డ్రెస్ ఫోటోలు సోషల్ మీడియాలో హీట్ పెంచేస్తున్నాయి. ట్రెండీ లుక్‌తో టెర్రస్ మీద దిగిన ఈ ఫోటోల్లో ఆషు రెడ్డి తన స్టన్నింగ్ లుక్స్‌తో సెగలు పుట్టిస్తోంది. తన ఆకర్షణీయమైన వంపులను హైలెట్ చేస్తూ, బ్లాక్ లిటిల్ డ్రెస్‌లో గ్లామర్‌ను మరింత హైలైట్ చేసింది. ఆషు రెడ్డి స్టైల్ అంటేనే ఒక ప్రత్యేకమైనదిగా ఉంటుంది. ఆమె ఎప్పటికప్పుడు ట్రెండింగ్ అవుట్‌ఫిట్స్‌తో ఫ్యాషన్ స్టేట్‌మెంట్ సెట్ చేస్తుంటుంది. తాజాగా షేర్ చేసిన ఈ బ్లాక్ బాడికాన్ డ్రెస్ ఆమె గ్లామర్‌ను మరో లెవెల్‌కి తీసుకెళ్లింది. స్లీవ్‌లెస్ కట్, సైడ్ స్లిట్స్, బాడీ హగ్గింగ్ డిజైన్ ఈ డ్రెస్‌కి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే సింపుల్ మేకప్, కాంపాక్ట్



హైలైట్, అండ్ స్టైలిష్ కర్లీ హెయిర్ లుక్ ఆమె అందాన్ని రెట్టింపు చేశాయి. ఈ ఫోటోల్లో ఆషు రెడ్డి కాన్ఫిడెంట్ బాడీ లాంగ్వేజ్, స్టన్నింగ్ పోజెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఫోటోలకు అదిరిపోయే క్యాప్షన్ కూడా ఇచ్చింది – "క్రేజీ!!" అంటూ హీటెక్కించే ఎమోజీలతో తన మూడ్‌ని రివీల్ చేసింది. ఇప్పటికే ఈ ఫోటోలు వైరల్ అవుతూ, లైక్‌లు, కామెంట్ల వర్షం కురుస్తోంది. అంతేకాదు, ఆషు రెడ్డి ఫిట్‌నెస్‌పై పెట్టుకున్న ఫోకస్ కూడా ఈ ఫోటోల ద్వారా స్పష్టంగా కనిపిస్తోంది. టోన్‌డ్ బాడీ, సొగసైన ఫిజిక్, కాంప్లిమెంట్ అయ్యే డ్రెస్సింగ్ సెలక్షన్ ఆమెని మరింత స్టైలిష్‌గా చూపిస్తోంది. సాధారణంగా గ్లామర్ షో చేస్తేనే కాదు, దాన్ని స్టైలిష్‌గా ప్రెజెంట్ చేయడంలోనూ ఆషు రెడ్డి ముందు ఉంటుంది. ఇక సినిమాల్లో పెద్దగా అవకాశాలు లేకున్నా, సోషల్ మీడియా ద్వారా తను క్రేజ్‌ను పెంచుకుంటూ వెళ్తోంది. ఇన్‌స్టాగ్రామ్‌లో రెగ్యులర్‌గా తన గ్లామర్ ఫోటోలు షేర్ చేస్తూ, నెటిజన్లను ఆకర్షిస్తోంది. ఈ తాజా ఫోటోషూట్ చూస్తుంటే, త్వరలోనే ఆషు రెడ్డి మంచి ఆఫర్లు దక్కించుకోవడం ఖాయం అనే అభిప్రాయం నెటిజన్లలో వ్యక్తమవుతోంది.

## కియరా ఎక్కడ తేడా కొడుతుంది..?

బాలీవుడ్ భామ కియరా అద్వాని కెరీర్ లో తన దూకుడు తగ్గించింది. కెరీర్ మొదట్లోనే ఒక రేంజ్ లో పాపులారిటీ సంపాదించి ఇటు సినిమాలు అటు వెబ్ సీరీస్ లు చేస్తూ వచ్చిన అమ్మడు ఇప్పుడు సినిమాలైతే చేస్తుంది కానీ అందుకు తగిన రేంజ్ లో డిమాండ్ ని పొందట్లేదు. కియరా బాలీవుడ్ తో పాటు సౌత్ సినిమాల్లో కూడా నటించింది. ముఖ్యంగా మహేష్ బాబుతో భరత్ అనే నేను చేసింది. ఆ నెక్స్ట్ చరణ్ తో వినయ విధేయ రామ, గేమ్ ఛేంజర్ చేసింది. ఐతే గేమ్ ఛేంజర్ సినిమా వర్క్ అవుట్ అయితే అమ్మడి లెక్క వేరేలా ఉండేది. కానీ అది అంచనాలను అందుకోకపోవడం వల్ల ఎఫెక్ట్ అమ్మడి మీద పడింది. లాస్ట్ ఇయర్ ఒక్క సినిమా కూడా రిలీజ్ కాలేదు. ఈ ఇయర్ మొదట్లోనే గేమ్ ఛేంజర్ షాక్ ఇవ్వడంతో కియరా కెరీర్ డైలమాలో పడింది. ఐతే కియరా నెక్స్ట్ చేస్తున్న సినిమాలు మాత్రం అదిరిపోనున్నాయి. హృతిక్ రోషన్, ఎన్టీఆర్ కలిసి చేస్తున్న వార్ 2 లో ఛాన్స్ పట్టేసిన అమ్మడు యష్ టాక్సిక్ లో కూడా నటిస్తుంది. ఈ రెండు సినిమాలు ఈ ఇయర్ రిలీజ్ ప్లాన్ లో ఉన్నాయి. టాక్సిక్



వచ్చినా రాకపోయినా వార్ 2 మాత్రం కచ్చితంగా వస్తుంది.

ఐతే ఈ సినిమాలతో కియరా కూడా తిరిగి ఫాంలోకి రావాలని చూస్తుంది. సినిమాలు చేస్తున్నా కియరా మీద ఆడియన్స్ గురి కలగట్లేదు అంటే అమ్మడు అన్ లక్కీ అని చెప్పొచ్చు. అందుకే ఇప్పుడు గేర్ మార్చి వరుస ఫోటో షూట్స్ తో కూడా వావ్ అనిపించేయాలని ఫిక్స్ అయ్యింది అమ్మడు. వార్ 2, టాక్సిక్ రిజల్ట్ బట్టే కియరా కెరీర్ ఆధారపడి ఉంటుంది. కెరీర్ మీద ఇంకాస్త ఫోకస్ పెట్టి తన సత్తా చాటాలని చూస్తున్న కియరాకు కాస్త లక్ తోడైతే మాత్రం మళ్లీ అమ్మడు టాప్ లీగ్ లోకి వచ్చేస్తుందని చెప్పొచ్చు. రాబోయే సినిమాలతో అయినా కియరాకి కలిసి రావాలని ఆమె ఫాలోవర్స్ కూడా కోరుతున్నారు. వారి ప్రార్ధనలు అమ్మడిని తిరిగి హిట్ ట్రాక్ ఎక్కేలా చేస్తాయా లేదా అన్నది చూడాలి.




# మల్టీ టాస్కింగ్ లో సూపర్ స్టార్లు!



నటించడం..నిర్మించడం..దర్శకత్వం వహించడం ఇలా ఒకేసారి ఇన్ని పనులు చేయడం అన్నది అందరి వల్ల కాదు. అది కొందరికే సాధ్యం. అందులో మాస్టర్లు ఎవరు? అంటే మాలీవుడ్ నటులనే చెప్పాలి. అంతగా కష్టపడతారు కాబట్టే మోహన్ లాల్, మమ్ముట్టి లాంటి సీనియర్ హీరోలు ఏడాదికి కనీసం ఆరు సినిమాలైనా ప్రేక్షకుల ముందుకు తీసుకు రాగలుగుతున్నారు. మోహన్ లాల్ ఈ మధ్య దర్శకుడిగా కూడా ఎంట్రీ ఇచ్చారు.

ఇకపై ఆయన నటిస్తూ దర్శకత్వం వహించడం కూడా జరుగుతుంది. దుల్కర్ సల్మాన్ మాలీవుడ్కి బ్రేక్ ఇచ్చి కోలీవుడ్ , టాలీవుడ్ ని బ్యాలెన్స్ చేస్తున్నాడు. తెలుగులో అతడి కి మంచి మార్కెట్ ఉండటంతో ఎక్కువగా ఇక్కడ సినిమాలు చేస్తున్నాడు. మధ్యలో కోలీవుడ్ ని టచ్ చేస్తున్నాడు. అలాగని మాలీవుడ్ ని లైట్ తీసుకోలేదు. అక్కడా కథలు వింటున్నాడు. సరైన కథలు దొరికితే లాక్ చేసి పెడుతున్నాడు. అలాగే నిర్మాతగానూ రాణిస్తున్నాడు. కేవలం నటన ఒక్కటే బాధ్యత అనుకోకుండా? నచ్చిన కథల కోసం పెట్టుబడి పెడుతున్నాడు. సరిగ్గా ఇదే మార్గంలో టివినో థామస్ కూడా కనిపిస్తున్నాడు. ఓ వైపు హీరోగా సినిమాలు చేస్తూనే నిర్మాణంలో కూడా రాణిస్తున్నాడు. ఇతర స్టార్ హీరోల చిత్రాల్లో కీలక పాత్రలు సైతం పోషిస్తున్నాడు. హీరో అనే ఇమేజ్ ని పక్కన బెట్టి పనిచేస్తున్నాడు. ఇక పృధ్వీరాజ్ సుకుమారన్ గురించి చెప్పాల్సిన పనిలేదు. మాలీవుడ్ లో స్టార్ హీరో.

అక్కడ హీరోగా సినిమాలు చేస్తూనే దర్శకుడిగానూ బిజీగా ఉన్నారు. తెలుగు,తమిళ్ లో స్టార్ హీరోల చిత్రాల్లో కీలక పాత్రలు పోషిస్తున్నాడు. మరో సీనియర్ హీరో మమ్ముట్టి కూడా అంతే బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ఆయన ఇప్పటికే నాలుగు సినిమాలు రిలీజ్ చేస్తానని ప్రామిస్ చేసారు. ఏడాది ముగింపుకల్లా ఆసంఖ్య పెరిగే అవకాశం ఉండొచ్చని హిట్ ఇచ్చారు.

# నిర్మాతల న్యూ ట్రాక్.. పెద్ద సినిమాలకంటే ఈ ప్లాన్ బెటర్!




టాలీవుడ్‌లో సినిమాల వర్గీకరణ బడ్జెట్‌ను ఆధారంగా చేసుకొని జరుగుతుంది. చిన్న సినిమాలు పరిశ్రమకు బలమైన వృద్ధిని అందిస్తే, పెద్ద సినిమాలు బాక్సాఫీస్ రికార్డులను తిరగరాస్తాయి. కానీ గత కొంతకాలంగా, మీడియం రేంజ్ బడ్జెట్ సినిమాలే ఇండస్ట్రీలో మరింత ప్రాధాన్యత పొందుతున్నాయి. గతంలో బడా నిర్మాతలు ఎక్కువగా పెద్ద సినిమాలపైనే దృష్టి పెడుతుండగా, ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. భారీ బడ్జెట్ పెట్టి ఒకే ఒక సినిమాను తీయడం కన్నా, అదే ఖర్చుతో రెండు మూడు మిడ్ రేంజ్ సినిమాలు తీస్తే లాభాలు ఎక్కువగా వస్తాయని అర్థం చేసుకున్నారు. ఈ ట్రెండ్‌ను బలపరిచిన స్టూడియోలలో సితార ఎంటర్టైన్‌మెంట్స్ ముందు వరుసలో ఉంది. ఈ సంస్థ నుంచి వచ్చిన సినిమాల్లో 90 శాతం మిడ్ రేంజ్ చిత్రాలే. అయితే అవే మంచి వసూళ్లు సాధించి, సితారను టాలీవుడ్‌లో టాప్ ప్రొడక్షన్ హౌస్‌లలో ఒకటిగా నిలబెట్టాయి. మ్యాడ్, టిల్లు, టిల్లు స్క్వేర్, సార్, లక్కీ భాస్కర్ వంటి చిత్రాలు కమర్షియల్‌గా బాగా ఆడటంతో, నాగ వంశీ ఈ ఫార్ములా ద్వారా మరిన్ని లాభాలను అందుకున్నారు. ఇప్పుడీ సంస్థ నుంచి ఒక పెద్ద సినిమా వస్తే, అదే బ్యాలెన్స్ చేయడానికి నాలుగు మీడియం బడ్జెట్ సినిమాలు లైన్‌లో ఉంటున్నాయి. ఇక టాలీవుడ్‌లో మరో స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు కూడా ఇదే దారిలో అడుగుపెట్టాడు. ఈ సంక్రాంతికి ఆయన నిర్మించిన భారీ బడ్జెట్ చిత్రం గేమ్ చేంజర్ ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది. ఏకంగా 100 కోట్ల వరకు దెబ్బ కొట్టింది. కానీ అంచనాలు లేకుండా వచ్చిన సంక్రాంతికి వస్తున్నాం సినిమా ఊహించని వసూళ్లను రాబట్టి, బాక్సాఫీస్‌ను షేక్ చేసింది. దాంతో 100 కోట్ల నష్టం ఈ సినిమాతో రికవరీ అయ్యింది. దిల్ రాజు కూడా పెద్ద సినిమాల కంటే, మిడ్-రేంజ్ సినిమాలే మంచివని భావనకు వచ్చి, దాని పైనే ఫోకస్ పెడుతున్నట్లు తెలుస్తోంది. కేవలం సితార, దిల్ రాజు మాత్రమే కాదు, ఇతర ప్రముఖ నిర్మాణ సంస్థలు కూడా ఇదే దిశగా ప్రయాణం మొదలుపెట్టాయి. డివివి దానయ్య, బివిఎస్ఎన్ ప్రసాద్ వంటి ప్రముఖ నిర్మాతలు కూడా ఇప్పుడు ఎక్కువగా మీడియం బడ్జెట్ సినిమాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. భారీ బడ్జెట్ పెట్టి సినిమా తీయడం కంటే, మిడిల్ రేంజ్ సినిమాల ద్వారా మంచి మార్కెట్‌తో పాటు, తక్కువ రిస్క్‌లో లాభాలను పొందొచ్చని అనుభవంతో అర్థం చేసుకున్నారు. ప్రస్తుతం ఈ మారుతున్న ట్రెండ్ వల్ల టైర్ 2 హీరోలకు మంచి అవకాశాలు వస్తున్నాయి. ఒకప్పుడు కేవలం స్టార్ హీరోల సినిమాలకే ఎక్కువ బడ్జెట్ కేటాయించేవారు. కానీ ఇప్పుడు ఆ ధోరణి మారిపోయింది.

మధ్యస్థాయి కథలను సరిగ్గా ప్రెజెంట్ చేస్తే, థియేటర్లలో కూడా మంచి వసూళ్లు రాబట్టవచ్చని నిర్మాతలు నమ్ముతున్నారు. ముఖ్యంగా వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్ వంటి సంస్థలు కూడా తమ కదలికలను దీనికనుగుణంగా మార్చుకుంటున్నాయి. ఇప్పుడున్న పరిస్థితిని చూస్తుంటే, టాలీవుడ్‌లో వచ్చే కాలంలో మరింత ఎక్కువగా మిడ్ రేంజ్ సినిమాల హవా కనిపించేలా ఉంది.

## పిల్లలు కనాలంటే భర్తతో పన్లేదు.. సీరియల్ నటి సెన్సేషనల్ కామెంట్స్!

హీరోహీరోయిన్లంతా మెల్లిగా తమ సింగిల్ లైఫ్ ను వదిలేసి వైవాహిక బంధంలోకి అడుగుపెడుతున్నారు. మరికొందరు వివాహ బంధానికి గుడ్ బై చెప్తున్నారు. ఇలాంటి టైమ్ లో ఓ హీరోయిన్ చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి. బాలనటిగా కెరీర్ ప్రారంభించి, ఎన్నో సీరియల్స్ లో నటించి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న టీనా దత్తా బుల్లితెరపై ఎంతో ఫేమస్ అన్న విషయం తెలిసిందే. కలర్స్ టీవీ ఉత్తరన్ సీరియల్ తో బాగా పాపులరైన టీనా దత్త ప్రస్తుతానికి సింగిల్ గానే ఉంది. ఫ్యూచర్ లో కూడా తనకు ఎవరితో కలిసే ఆలోచన లేదంటూ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. తన ఫ్యూచర్ ప్లానింగ్ గురించి టీనా రీసెంట్ గా మాట్లాడింది. సింగిల్ గా తల్లి కావడానికి తనకెలాంటి అభ్యంతరం లేదని, తల్లి



కావడానికి పెళ్లి చేసుకోనక్కర్లేదని టీనా అంటోంది. పెళ్లి చేసుకోవడానికి కూడా తాను తొందరపడట్లేదని, కానీ ఫ్యూచర్ లో మాత్రం దత్తత తీసుకునో లేదా సరోగసీ ద్వారానో తల్లి కావాలని చూస్తున్నట్టు టీనా తెలిపింది. తాను మంచి తల్లిని కాగలనని నమ్ముతున్నానని, సరైన టైమ్ వచ్చినప్పుడు తాను మంచి తల్లిగా ప్రూవ్ చేసుకుంటానని టీనా దత్తా చెప్పుకొచ్చింది. సుస్మితా సేన్‌కు పెద్ద ఫ్యాన్ అని చెప్తున్న టీనా, ఆమె ఇద్దరు కూతుళ్లను దత్తత తీసుకోవడం చూసే తాను కూడా ఆ దారిలో వెళ్లాలనుకుంటున్నట్టు తెలిపింది. అయితే తను ఏ నిర్ణయం తీసుకున్నా తన తల్లిదండ్రుల మద్దతు ఉంటుందని, ఫ్యూచర్ లో సరోగసీ లేదా దత్తత తీసుకుని పిల్లలకు తల్లినైనా తన తల్లిదండ్రులు ఆమె అభిప్రాయాన్ని గౌరవిస్తారని టీనా ఈ సందర్భంగా వెల్లడించింది. భర్త అవసరం లేకుండానే పిల్లల్ని కనగలనని, పెంచగలనని టీనా అభిప్రాయపడింది.

## బ్లాక్ డ్రెస్‌లో పూజా హెగ్డే హై గ్లామర్ ట్రీట్

స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే ప్రతి ఒక్క ఫోటోషూట్‌తో తన స్టైల్ ను మరో లెవెల్ కు తీసుకెళ్తుంది. తాజాగా ఆమె బ్లాక్ డ్రెస్‌లో పోజులిచ్చిన ఈ కొత్త ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మరింత గ్లామర్ కలబోసిన ఈ లుక్ ఆమెకు మరింత ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. బ్లాక్ అండ్ వైట్ కాంబినేషన్‌లో, ట్రెండీ డిజైన్‌లో ఉన్న ఈ డ్రెస్సింగ్ స్టైల్ ఆమెను హై ఫ్యాషన్ లుక్‌లోకి తీసుకెళ్లింది.పూజా హెగ్డే అవుట్‌ఫిట్స్ ఎప్పుడూ క్లాసీగా, స్టైలిష్‌గా ఉంటాయి. ఈ సారి ఆమె ధరించిన బ్లాక్ డ్రెస్, థ్రెడ్ వర్క్ డిజైన్, స్లీవ్‌లెస్ ఫిట్ కట్ విత్ స్లిట్ స్టైల్ కలిపి లుక్స్‌ను మరో స్థాయికి తీసుకెళ్లాయి. పెర్‌ఫెక్ట్ మేకప్, స్టేట్‌మెంట్ ఇయరింగ్‌లు, కాంపాక్ట్ హెయిర్ స్టైల్ అన్నీ కలిసి ఆమెను రెడ్కార్పెట్ రిచ్ లుక్‌లో చూపించాయి. ఈ ఫోటోల లో కళ్లతోనే ఆకర్షణ కలిగించేలా ఆమె ఇచ్చిన ఎక్స్‌ప్రెషన్స్ చూస్తుంటే నిజంగా పూజా హెగ్డే తన గ్లామర్ స్టైల్‌లో యునీక్ అని మరోసారి నిరూపించుకుంది. హైహీల్స్, లైటింగ్ ఎఫెక్ట్, బ్యాక్‌డ్రాప్ అన్నీ కలిపి



ఈ ఫోటోషూట్‌ను హై స్టాండర్డ్‌కు తీసుకెళ్లాయి. ఈ ఫోటోలు ఆమె లేటెస్ట్ ప్రాజెక్ట్ ప్రమోషన్‌లో భాగమా లేక వేరే స్పెషల్ కంటెంట్‌గా వచ్చాయా అనేది ఇంకా క్లారిటీ లేదు. ఇక ఈమె ఫ్యాషన్ స్టేట్‌మెంట్ అన్నది ఎప్పటికప్పుడు కొత్త ట్రెండ్‌లను సెట్ చేసేలా ఉంటుంది. సోషల్ మీడియాలో ఆమె పోస్ట్ చేసే ప్రతి ఫోటోకి లక్షలల్లో లైక్స్ రావడం చూస్తుంటే అభిమానులు ఎంతగానో కనెక్ట్ అవుతున్నారని అర్థమవుతోంది. ముఖ్యంగా ఈ బ్లాక్ డ్రెస్ లుక్ పూజా కెరీర్‌లో మరొక ట్రెండింగ్ ఫ్యాషన్ మూమెంట్‌గా నిలిచిపోవడం ఖాయం. ఇప్పటికే పలు ప్రాజెక్టులతో బిజీగా ఉన్న పూజా హెగ్డే, విజయ్ 69లో కూడా మెయిన్ హీరోయిన్ గా కనిపించబోతోంది. అలాగే హిందీలో కూడా పలు సినిమాలు లైన్ లో ఉన్నాయి. ఇక తెలుగులో ఈమధ్య అమ్మడికి అవకాశాలు తగ్గాయి. అయినప్పటికీ తన అందంతో సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన ఉనికిని చాటుకుంటోంది.




## కాంగ్రెస్ నేతల రహస్య సమావేశం.. ఫోన్ చేసినా..

తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో ముసలం మొదలైందని వార్తలు వస్తున్నాయి. 10 మంది హస్తం పార్టీ ఎమ్మెల్యేలు ఓ హోటల్‌లో రహస్యంగా సమావేశం అయ్యారని పుకార్లు వస్తున్నాయి. ఒక మంత్రి తమను పట్టించుకోవడం లేదని ఆరోపణలు చేసినట్లు సమాచారం. తమ నియోజకవర్గంలో తమకు తెలియకుండానే మంత్రి నిర్ణయాలు తీసుకుంటున్నారని ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారని వినిపిస్తోంది. బీఆర్ఎస్ నేతలకు ప్రభుత్వంలో పనులు అవుతున్నాయని, కానీ సొంత పార్టీ ఎమ్మెల్యేలకు మాత్రం ఆలస్యం చేస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారని తెలుస్తోంది. ఈ రూమర్స్‌పై ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అలర్ట్ అయింది. మంత్రులు, ఎమ్మెల్యేల మధ్య సమన్వయంపై ఫోకస్ చేస్తోందని తెలిసింది. పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ ఎమ్మెల్యేలకు ఫోన్ చేసి కలిసి మాట్లాడుకుందామని సముదాయించారని సమాచారం.




దిల్లీ: వైద్య విద్యను అభ్యసించాలనుకునే విద్యార్థులకు కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ శుభవార్త చెప్పారు. దేశవ్యాప్తంగా వైద్య సీట్లను పెంచబోతున్నట్లు వెల్లడించారు. ఈమేరకు శనివారం ప్రకటించిన కేంద్ర బడ్జెట్-2025లో ఆమె పేర్కొన్నారు. వచ్చే ఏడాది నుంచి సంవత్సరానికి కనీసం 10 వేలు చొప్పున పెంచేందుకు కేంద్రం సిద్ధమైందన్నారు. ఇలా రానున్న ఐదేళ్లలో 75 వేల సీట్లు పెంచుతామన్నారు. మరోవైపు, దేశవ్యాప్తంగా ఉన్న మొత్తం 23 ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ (ఐఐటీ)కు కూడా నిర్మలమ్మ గుడ్‌న్యూస్ చెప్పారు. దేశ వ్యాప్తంగా ఉన్న 23 ఐఐటీలలో అదనపు మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. పదేళ్ల క్రితం ఐఐటీ సీట్ల సంఖ్య 65 వేలు ఉండగా.. ప్రస్తుతం 1.35 లక్షలకు చేరింది. అంటే దాదాపు 100శాతానికిపైగా పెరిగింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనపు మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. ముఖ్యంగా 2014 తర్వాత ప్రారంభించిన ఐదు ఐఐటీలలో అదనంగా 6,500 మంది విద్యార్థులు చదువుకునేందుకు వీలుగా ప్రణాళికలు వేశారు. నైపుణ్యాభివృద్ధి, ఉన్నత విద్యలో పెట్టుబడులపై దృష్టిసారించడంలో భాగంగా దేశవ్యాప్తంగా ఐదు నేషనల్ సెంటర్స్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ కేంద్రాలను స్థాపించనున్నట్లు సీతారామన్ తెలిపారు. 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్'కు అవసరమైన నైపుణ్యాలను నేర్చుకునేందుకు, అందుకనుగుణంగా యువతను సన్నద్ధం చేయడానికి ఇవి ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. సుమారు రూ.500 కోట్లతో సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఫర్ ఎడ్యుకేషన్‌ను ఏర్పాటుచేయనున్నట్లు ఆమె పేర్కొన్నారు.




ఆర్థిక వృద్ధికి కీలకమైన వాటిలో వ్యవసాయం ఒకటని బడ్జెట్ ప్రసంగంలో భాగంగా కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. ఆహార భద్రత లక్ష్యంతో.. సులభంగా రుణాలు అందేలా, వ్యవసాయ రంగంలో నిరుద్యోగితను పరిష్కరించేలా, వలసలు తగ్గించే లా, సాంకేతికతను మరింత అందుబాటులోకి తెచ్చేలా మంత్రి ప్రకటనలు చేశారు.

**పీఎం ధన ధాన్య కృషి యోజన..** తక్కువ ఉత్పాదకత, పంట దిగుబడి మధ్యస్థంగా ఉండే వెనకబడిన 100 జిల్లాల్లో వ్యవసాయానికి ప్రోత్సాహం అందించే పీఎం ధన ధాన్య కృషి యోజన పథకాన్ని కేంద్రం ప్రకటించింది. దీనికింద కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయి. గోదాములు, నీటిపారుదల, రుణ సౌకర్యాల కల్పన, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను అవలంభించడం, పంచాయతీ, బ్లాక్ స్థాయిల్లో పండించిన పంట నిల్వలను పెంచడం ద్వారా 1.7 కోట్ల గ్రామీణ రైతులకు లబ్ధి చేకూర్చడం దీని లక్ష్యం. గ్రామీణ ఆర్థికవ్యవస్థకు ఊతమిచ్చేలా అవకాశాలను సృష్టించడమే లక్ష్యమని మంత్రి తెలిపారు. దీనిద్వారా పొట్టచేత పట్టుకొని వలస పోయేవారికి తగ్గించగలుగుతామని ఆమె ఆశాభావం వ్యక్తంచేశారు.

**కిసాన్ క్రెడిట్ కార్డుల పరిమితి పెంపు..** రైతులకు పంట సాగు కోసం పెట్టుబడులు అవసరమైనప్పుడు అధిక వడ్డీ రేట్లతో అప్పులు చేయకుండా తక్కువ వడ్డీకే సమయానుసారం రుణాలు అందిస్తాయి కిసాన్ క్రెడిట్ కార్డులు. దీని పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచుతున్నట్లు నిర్మలమ్మ వెల్లడించారు. వ్యవసాయం, మత్స్య, పశుసంవర్ధక రంగాల్లో రైతులు, అవసరమైన పరికరాల కొనుగోలు, ఇతర ఖర్చులకు స్వల్పకాలిక రుణం పొందొచ్చు. దీంతో 7.7 కోట్ల మంది రైతులకు ప్రయోజనం కలగనుంది.

**పప్పుధాన్యాల కోసం ఆత్మనిర్భరత మిషన్..** వంట నూనెల్లో స్వయంసమృద్ధి కోసం ఎడిబుల్ ఆయిల్‌సీడ్ నేషనల్ మిషన్‌ను అమలుచేయనుంది. కంది, మినుములు, మసూర్‌లో స్వయంసమృద్ధి కోసం ఆరు సంవత్సరాల కాలానికి మిషన్ ఫర్ ఆత్మనిర్భరత ఇన్ పల్సెస్‌ను ప్రభుత్వం తీసుకురానుంది. దీనికింద తమతో ఒప్పందాలు చేసుకున్న రైతుల నుంచి కేంద్ర ఏజెన్సీలు ఈ పప్పులను కొనుగోలు చేస్తాయి.

## రూ. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు.. విప్లవాత్మక నిర్ణయం: బండి సంజయ్



దిల్లీ: దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. బడ్జెట్ 2025-26.. పేద, మధ్య తరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్‌గా ఆయన పేర్కొన్నారు. 2027 నాటికి అమెరికా, చైనా తర్వాత మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరించే దిశగా బడ్జెట్ రూపకల్పన ఉందన్నారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. వేతన జీవులకు రూ. 12 లక్షల వరకు పన్ను మినహాయింపు ఇవ్వడం విప్లవాత్మక నిర్ణయం అని కొనియాడారు. కిసాన్ క్రెడిట్ కార్డుల కోసం రైతులంతా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలంగాణలో 50 లక్షల మందికి పైగా రైతులు రూ. 5లక్షల వరకు రుణం పొందే అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు బండి సంజయ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర బడ్జెట్‌పై విపక్షాలు అనవసర విమర్శలు మానుకోవాలని.. కేంద్రానికి సహకరించాలని సూచించారు.

# కేంద్ర బడ్జెట్‌పై నేతల రియాక్షన్ ఎలా ఉందంటే...

















హైదరాబాద్, ఫిబ్రవరి 1: లోక్‌సభలో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. కేంద్ర బడ్జెట్‌పై రాష్ట్రానికి చెందిన పలు పార్టీల నేతలు స్పందించారు. ఒక్కో నేత ఒక్కో విధంగా బడ్జెట్‌కు సంబంధించి మాట్లాడారు. బీజేపీ నేతలు బడ్జెట్ అద్భుతమని కొనియాడగా, బీఆర్ఎస్ నేతలు తెలంగాణకు మరోసారి అన్యాయం చేశారని మండిపడ్డారు. ఇక కాంగ్రెస్ నేతలు అయితే బడ్జెట్‌పై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ బడ్జెట్ బీహార్, ఢిల్లీ ఎన్నికల కోసం పెట్టినట్టు ఉందంటూ వ్యాఖ్యలు చేశారు. బడ్జెట్‌పై నేతలు ఏ విధంగా స్పందించారో ఇప్పుడు తెలుసుకుందాం.

**వారిని దృష్టిలో పెట్టుకునే బడ్జెట్: మల్లు రవి...** ఢిల్లీ, బీహార్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేంద్ర బడ్జెట్ తయారు చేసినట్టు ఉందని కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి అన్నారు. ఐదు సార్లు బడ్జెట్‌లో బీహార్ అంశాలను ప్రస్తావించారన్నారు. బడ్జెట్‌లో తెలంగాణ అంశం కానీ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు గురించి మాట్లాడ లేదని తెలిపారు. విభజన హామీలు, ట్రైబల్ యూనివర్సిటీ గురించి చెప్పలేదని.. ఈ ప్రభుత్వం వ్యాపారస్తుల ప్రభుత్వం అంటూ వ్యాఖ్యలు చేశారు.

భారతదేశంలో అతిపెద్ద సమస్య నిరుద్యోగం అని.. నిరుద్యోగం అంశాన్ని ఎక్కడ కూడా చెప్పలేదన్నారు. నిత్యావసర వస్తువుల గురించి పెద్ద పెద్ద మాటలు మాట్లాడిన మోదీ ఎక్కడా ఇప్పుడు ఆ అంశాన్ని చెప్పలేదని విమర్శించారు. రైతులు, పేద వారి గురించి ఎక్కడా మాట్లాడలేదని ఎంపీ మల్లు రవి అన్నారు.

**రైతులు ఉన్న ఏడు కోట్లేనా: ఎంపీ రామసహాయం రఘురాం...** ఈ బడ్జెట్ ఢిల్లీ, బీహార్ ఎన్నికల రాష్ట్రం కొరకు పెట్టినట్టుందని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి అన్నారు. బీహార్ రాష్టానికి మకాన బోర్డు ఏర్పాటు చేస్తామని బడ్జెట్‌లో చెప్పారని.. తెలంగాణకు ఎప్పటి నుంచో రెండో ఎయిర్ పోర్ట్ అడిగామని గుర్తుచేశారు.

రాష్టానికి బడ్జెట్‌లో ఇచ్చింది అంటూ ఏమి లేదన్నారు. దేశంలో 7 కోట్ల మంది మాత్రమే రైతులు ఉన్నారా అందరికీ ఎందుకు కిసాన్ క్రెడిట్ కార్డు ఇవ్వరని ప్రశ్నించారు. తెలంగాణలో భద్రాచలంకు నిధులు ఎందుకు ఇవ్వరని ఎంపీ ప్రశ్నించారు.

**దక్షిణాది రాష్ట్రాలపై చిన్న చూపు: ఎంపీ కిరణ్ కుమార్...** ఈ బడ్జెట్ బీహార్, ఢిల్లీ ఎన్నికల కోసం పెట్టినట్టు ఉందని కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. ఉడాన్ స్కీమ్ కింద ఎయిర్ పోర్టులు పెంచుతామని అంటున్నారని.. విమానం టిక్కెట్లపై నియంత్రణ ఉండాలని.. అది లేకుండా ఎయిర్ పోర్టులు పెంచుతామని అంటున్నారన్నారు. ఢిల్లీ గద్దెను దక్కించుకునే ఉద్దేశం చాలా స్పష్టంగా కనిపించిందని తెలిపారు. దక్షిణాది రాష్ట్రాలను బీజేపీ చిన్నచూపు చూస్తోందని విమర్శించారు. తెలంగాణ చాలా కీలకమైన రాష్ట్రం తెలంగాణ నుంచి కేంద్రానికి నిధులు ఎక్కవగా వస్తున్నాయన్నారు. సీఎం రేవంత్ రెడ్డి గతంలో కేంద్రంలో అందరి మంత్రులను కలిసి తెలంగాణకు ప్రాముఖ్యత కల్పించాలని కోరారన్నారు. మోదీ గుజరాత్ ముఖ్యమంత్రి అనే ఆలోచన నుంచి బయటకు రావాలని.. ఆయన ఈ దేశానికి ప్రధాన మంత్రి అని తెలిపారు. గుజరాత్ వ్యాపారస్తులకు అనుగుణంగా బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయని ఎంపీ చామల కిరణ్ కుమార్ అన్నారు.

**అట్టర్ ఫ్లాప్ బడ్జెట్: ఎంపీ వంశీ....** కేంద్ర బడ్జెట్ అట్టర్ ఫ్లాప్ బడ్జెట్ అని కాంగ్రెస్ ఎంపీ గడ్డం వంశీ అన్నారు. రాజకీయం కొరకు బడ్జెట్ ప్రవేశపెట్టారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బడ్జెట్‌లో నిర్లక్ష్యం చేశారని.. బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తాము ఎన్నో డిమాండ్లు, ప్రతిపాదనలు పెట్టామన్నారు. చాలా బాధాకరంగా ఉందన్నారు. యువత ఉద్యోగ, ఉపాధి లేకుండా కష్టపడుతున్నారన్నారు. అంబానీ, అదానికి కొత్త కొత్త బిజినెస్‌లు దక్కే విధంగా కనిపిస్తున్నాయన్నారు. సింగరేణికి సోలార్ ప్రాజెక్టు, క్లీన్ టెక్ ఎన్నో ప్రతిపాదనలు తాము ఆర్థిక మంత్రికి గతంలో ఇచ్చామని తెలిపారు. దళితులకు పన్నుల్లో ప్రత్యేక రాయితీ ఇవ్వాలని ఎంపీ గడ్డం వంశీ డిమాండ్ చేశారు.

**ఇది డ్రీమ్ బడ్జెట్: కిషన్ రెడ్డి...** పేదలు, మధ్యతరగతి ప్రజలు, రైతుల సంక్షేమానికి బాటలు వేస్తూనే.. అన్ని వర్గాలకు సమన్యాయం చేసే 'డ్రీమ్ బడ్జెట్' ఇది అని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. వికసిత్ భారత్ లక్ష్యాలను చేరుకునేలా రూపొందించిన బడ్జెట్ అని అన్నారు. వ్యక్తిగత ఇన్ కమ్ టాక్స్ పరిధిని 12 లక్షలకు పెంచడం చాలా పెద్ద నిర్ణయమని తెలిపారు. ఎమ్ఎస్ఎమ్ఈ, చిన్న పరిశ్రమలకు బడ్జెట్ ఆపన్నహస్తాన్ని అందించిందన్నారు. రాష్ట్రాల ప్రయోజనాలకు పెద్దపీట వేస్తూ.. సహకార సమాఖ్య స్ఫూర్తిని గౌరవించిన బడ్జెట్ ఇది అని అన్నారు. అన్ని సంక్షేమ పథకాలకు నిధులను పెంచడం అభినందనీయమన్నారు. ప్రధానమంత్రి మోదీ, ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్‌కు ధన్యవాదాలు తెలియజేశారు కేంద్రమంత్రి.

**ఇది అద్భుతమైన బడ్జెట్: బండి సంజయ్....** కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశ గతినే మార్చే అద్భుతమైన బడ్జెట్ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. పేద, మధ్యతరగతి, యువత, రైతు సంక్షేమ బడ్జెట్ అని తెలిపారు. రూ.12 లక్షల వరకు పన్ను మినహాయింపు విప్లవాత్మకమని చెప్పుకొచ్చారు. తెలంగాణ సహా దేశంలోని ఒక్కో ఉద్యోగికి రూ.80 వేల వరకు ఆదా అవుతుందన్నారు. గత 75 ఏళ్లలో మునుపెన్నడూ లేనివిధంగా మధ్యతరగతికి అనుకూలమైన బడ్జెట్ ఇది అంటూ బండి సంజయ్ అన్నారు.

**దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లుగా బడ్జెట్: హరీష్ రావు...** 2025-26 బడ్జెట్ తన రాజకీయ అవసరాలే ఉపయోగించుకున్నది తప్ప, దేశ సమ్మిళిత వృద్ధిని ఏమాత్రం పట్టించుకున్నట్లు లేదని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. ఎన్నికలు ఉన్న రాష్ట్రాలకు పెద్ద మొత్తంలో వరాలు ప్రకటించి, ఎన్నికలు లేని రాష్ట్రాల పట్ల వివక్ష చూపడం సరికాదన్నారు. దేశమంటే మట్టి కాదోయ్ దేశమంటే మనుషులోయ్ అంటూ ప్రసంగించిన నిర్మల సీతారామన్.. దేశమంటే కొన్ని రాష్ట్రాలే అన్నట్లు బడ్జెట్ ప్రవేశ పెట్టడం బాధాకరమన్నారు. మొదటి నుంచి ఇదే దోరణిని ప్రదర్శిస్తూ రాజకీయ అవసరాలు తీర్చుకుంటోందని కేంద్ర ప్రభుత్వం అంటూ హరీష్ వ్యాఖ్యలు చేశారు.

**పేరుకే తెలుగు పడుచు.. కానీ: జగ్గారెడ్డి...** కేంద్ర ప్రభుత్వం పెట్టిన 50 లక్షల కోట్ల బడ్జెట్ పెట్టారని.. . కానీ తెలంగాణ రాష్ట్రానికి, ప్రజలకు ఎలాంటి కేటాయింపులు లేవని కాంగ్రెస్ నేత జగ్గా రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రజలు కోరుకున్నట్టు బడ్జెట్‌లో కేటాయింపులు లేకపోవడం నిరాశకు గురిచేసిందన్నారు. తెలంగాణ నుంచి ప్రజలు కట్టే పన్నులు ఏడాదికి లక్ష కోట్లు అని తెలిపారు. తెలుగు రాష్ట్రాల ఆడబిడ్డలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించకపోవడంతో ఒక ప్రశ్నగా మిగిలిపోయారన్నారు. తెలంగాణ ప్రజలు 8 మంది ఎంపీలను గెలిపించారని.. దీంట్లో ఇద్దరు కేంద్ర మంత్రులు అయ్యారని తెలిపారు. నిర్మలా సీతారాం...పేరుకే తెలుగు ఆడపడుచు అని.. తెలంగాణకు ప్రత్యేక నిధి కేటాయించకోవడం ఆమె రాజకీయ బలహీనురాలిగా భావిస్తున్నామన్నారు. అందుకే తెలంగాణకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించలేకపోయారని వ్యాఖ్యలు చేశారు. ఇది దేశ బడ్జెట్‌లా లేదని.. బీహార్ ఎన్నికల బడ్జెట్‌గా కనపడుతోందని జగ్గారెడ్డి పేర్కొన్నారు.




ప్రభుత్వం ఆదాయపు పన్నులో భారీ మార్పును తీసుకొచ్చి మధ్యతరగతిని ఖుషీ చేసింది. కొత్త పన్ను విధానంలో రూ.12 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేకపోవడంతో రూ.80 వేలు వరకు మిగిలే అవకాశం ఉంది. ఓవైపు వృద్ధి రేటు తగ్గడం, ప్రజలు కూడా ఖర్చులను తగ్గించుకోవడం, కీలక రాష్ట్రాల్లో ఎన్నికలు వంటి అంశాలు ఉండటంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొంది.

**మరింత ఆకర్షణీయంగా చేయడం..** పాత పన్ను విధానంతో పోలిస్తే కొత్తది చాలా సరళంగా ఉంది. ఇప్పటికే పన్ను చెల్లింపుదారుల్లో దాదాపు 70శాతం మంది దీనిలోకి మారినట్లు గణంకాలు చెబుతున్నాయి. ఇప్పుడు తాజాగా కొత్త దానిలో మరిన్ని శ్లాబ్‌లను తీసుకురావడంతో పాత విధానం ఇక దాదాపు చాలామందికి పెద్దగా లబ్ధి చేకూర్చే పరిస్థితి లేదు.

**మధ్యతరగతికి గాలం..** మోదీ సర్కారు ఆదాయపు పన్నుదారుల విషయంలో దయ చూపడం లేదన్న విమర్శలు ఎప్పటినుంచో ఎదుర్కొంటోంది. చాలా వేదికలపై ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామనే ప్రజల అసంతృప్తిని ప్రత్యక్షంగా చూశారు. 2022లో ప్రైస్ సంస్థ విడుదల చేసిన నివేదిక ప్రకారం దేశ జనాభాలో 43.2 కోట్ల మంది (31శాతం) మధ్యతరగతివారే. 2046 నాటి వారి సంఖ్య 100 కోట్లను దాటేస్తుందన్నది అంచనా. ఇది నాటి జనాభాలో 61 శాతానికి సమానమవుతుంది. తాజాగా దిల్లీ, మరికొన్ని నెలల్లో బిహార్‌లో ఎన్నికలు ఉన్నాయి. ప్రతిపక్షాలు ఇప్పటికే దీనిని బలంగా తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తున్నాయి. పన్ను మినహాయింపుతోపాటు.. తాజాగా అద్దెలపై కూడా టీడీఎస్‌ను రూ.2.4 లక్షల నుంచి రూ.6 లక్షలకు పెంచే నిర్ణయం కూడా మిడిల్ క్లాస్‌ను లక్ష్యంగా చేసుకొన్నదే.

**వినిమయం పెంచేలా..** ప్రభుత్వం తాజాగా పన్ను మినహాయింపు నిర్ణయంతో చెల్లింపుదారులు ఒక్కొక్కరు అత్యధికంగా రూ.80వేలు వరకు లబ్ధి పొందొచ్చు. మొత్తం చూసుకొంటే ఈ రూపంలో ఆర్థికవ్యవస్థలోకి రూ.లక్ష కోట్లు వెళతాయి. దీంతో ఈ నిధులను కొనుగోళ్లు, పెట్టుబడులకు మళ్లిస్తారని అంచనా. దీంతోపాటు వస్తువులను కూడా ఆకర్షణీయంగా మార్చేందుకు కొన్నిరకాల వస్తువులపై పరోక్ష పన్నులను కూడా తగ్గించారు. మొబైల్ ఫోన్లకు విడిభాగాలపై కస్టమ్స్ డ్యూటీ తగ్గించడం వంటివి వీటిల్లో ఉన్నాయి.

**కీలక రంగాలకు మద్దతు..** ఈ బడ్జెట్ నిర్ణయాలతో ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్, రియల్ ఎస్టేట్ రంగాలకు లబ్ధి చేకూరనుంది. వీటిపైనే పన్ను మిగులు సొమ్మును వినియోగదారులు వెచ్చించే అవకాశాలు ఉన్నాయి.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com